
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 29 ఫిబ్రవరి 2024





తెరపైకి పాత బ్రాండ్లు?



- కొన్ని రోజులుగా హడావుడి
- దుకాణాల్లో మాత్రం పిచ్చి బ్రాండ్లే
- మందుబాబులను ఆకర్షించడానికేనని విమర్శలు
- దుకాణాలకు చేరకుండానే పాత బ్రాండ్లు మాయం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పిచ్చి బ్రాండ్లతో విసిగిపోయిన మందుబాబులను ఆకట్టుకునేందుకు.. ప్రభుత్వ మద్యం దుకాణాలకు వారిని తిరిగి రాబట్టుకునేందుకు పాత బ్రాండ్లు పేరుతో కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ హడావుడి మొదలు పెట్టాయి. ఎన్నికలకు మరో రెండు నెలల సమయం ఉండనగా పాత బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటనలు, ప్రచారాలు ఊపందుకుంటున్నాయి.నాలుగున్నరేళ్లకు పైగా పాత బ్రాండ్ల ఊసెత్తని ప్రభుత్వం ఉన్నట్లుండి పాత బ్రాండ్లతో హడావుడి చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం బ్రాండ్ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడి మందుబాబుల కోసమా? వచ్చే ఎన్నికల కోసమా? అనేది ఇప్పుడు తేలాల్సిన ప్రశ్న. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లు నాసిరకంగా ఉండడంతో మందు బాబులు ముఖం చాటేస్తున్నారు. దీంతో పాత బ్రాండ్లను తెస్తామని ప్రభుత్వం కొన్ని రోజులుగా హడావుడి మొదలు పెట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మూడు లిక్కర్ డిపోలు ఉండగా వాటి పరిధిలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పాత బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వాటితోపాటు బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల డివిజన్లోని షాపుల్లో కూడా పాత బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నికోల్స్ బ్లాక్, నికోల్స్ గోల్డ్ ప్రీమియం బ్రాందీ, 100 పైపర్స్ విస్కీ, బ్లెండర్స్ ప్రైడ్ విస్కీ, రాయల్ స్టాగ్ విస్కీ, బాల్లెంటైన్స్ ఫైనెస్ట్ విస్కీ, ప్లాటినమ్ సుపీరియర్ వైట్ రమ్ము, ప్లాటినమ్ ఒరిజినల్ సిట్రస్ రమ్ము, వైట్ హాల్, మేన్షన్ హౌస్, ఓల్డ్ అడ్మిరల్, అరిస్టోక్రాట్ ప్రీమియం, మార్ఫియస్, టీచర్స్ తదితర బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలుస్తోంది.

ఓటు అడుగుతారా.. లేదా?

2024 ఎన్నికల నాటికి రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి, మద్యం అనేదాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకు పరిమితం చేసి, ఆ తర్వాతే ఓట్లడుగుతా.. అని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆయన చెప్పిన మాట నెరవేర్చుకోవడానికి సరిగ్గా నెలరోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నెల రోజుల్లో మద్య నిషేధం చేసి ఓట్లడుగుతారా? లేక తాను చెప్పిన మాట ప్రకారం చేయలేదు కాబట్టి ఓట్లు అడగరా అనేది సరిగ్గా నెల రోజుల్లో తేలుతుంది.

అమ్మకాలే లక్ష్యంగా అడుగులు

నాలుగున్నరేళ్లుగా దశలవారీగా అంటూ నాలుక మడతేసిన నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పారు. మద్య నిషేదం మాటేమో గానీ, టార్గెట్లు పెట్టి మరీ మందుబాబులను తాగించే పనిలో పడ్డారు. టార్గెట్లు తగ్గినప్పుడల్లా కొత్తకొత్త స్కీములతో మందుబాబులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. మద్యం అమ్మకాలు భారీగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందుబాబులు మద్యం షాపులకు దూరమవ్వకుండా జాగ్రత్త పడుతోంది. ముట్టుకుంటే షాక్ కొట్టేలా మద్యం రేట్లు పెంచి మందుబాబులను అలవాటుకు దూరం చేస్తామని చెప్పిన ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో ఐదుసార్లు ధరలు తగ్గించింది. తాజాగా కిందటేడాది నవంబరు 18న ఒకసారి డిసెంబరు 29న మరోసారి మద్యం ధరలు తగ్గించింది. దీనికితోడు మద్యం దుకాణాలు తెరిచి ఉంచే సమయాన్ని ఏడాదికి ఒక గంట చొప్పున పెంచుతూ వస్తోంది. అయినప్పటికీ సంతృప్తి చెందని ప్రభుత్వం మందుబాబులను తిరిగి మద్యం దుకాణాలవైపు మళ్లించడానికి పాత బ్రాండ్ల నాటకాన్ని మొదలు పెట్టింది.

షాపుల్లో కొత్త బ్రాండ్లే..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో పాత బ్రాండ్ల హడావుడి మొదలై వారం రోజులకు పైగా అవుతోంది. మద్యం దుకాణాల్లో కూడా సేల్స్ బాయ్స్, సూపర్‌వైజర్లు పాత బ్రాండ్లపై ఊదరగొట్టారు. కొత్త బ్రాండ్లకు భయపడి మద్యం దుకాణాలకు దూరమైన మందుబాబులను తిరిగి రప్పించుకోవడానికి ప్రభుత్వం పాత బ్రాండ్ల పేరుతో ప్రచారం చేయిస్తోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ విమర్శలకు బలం చేకూరేలా పాత బ్రాండ్లను అడపాదడపా మాత్రమే సరఫరా చేస్తూ నాసిరకం కొత్త బ్రాండ్లనే ప్రభుత్వం మందుబాబులకు అంటగడుతున్నారు. పాత బ్రాండ్లు వస్తాయని ఆశపడిన మందుబాబులు కొందరు వాటి కోసం ప్రయత్నించి నిరాశ పడుతున్నారు. ఎప్పటిలాగే నాసిరకం కొత్త బ్రాండ్లతో సరిపుచ్చుకుంటున్నారు. వారం పది రోజులుగా పాత బ్రాండ్లపై హడావుడి కనిపిస్తున్నా తమకు అందుబాటులోకి రాకపోవడంతో మందుబాబులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పాత బ్రాండ్లు అందుబాటులోకి తెస్తోంది తమ కోసమా? లేక ఎన్నికలలో పంపిణీ కోసమా అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత బ్రాండ్లని మద్యం దుకాణాలకు చేరకుండానే వాటిని అధికారపార్టీ నేతలు మాయం చేస్తున్నారేమోనన్న సందేహం కలుగుతోంది. ఎన్నికల్లో నాసిరకం మద్యం పంపిణీ చేస్తే ఫలితం ఉండదని భావించి ప్రభుత్వమే ఇలా అడ్డదారులు తొక్కుతోందేమోనని వారు భావిస్తున్నారు. మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లు తప్ప పాత బ్రాండ్లు లేకపోవడంతో వారి అనుమానాలకు బలం చేకూరుతోంది.

బరిలోకి దిగకుండానే..
రమణ వాకౌట్

- గుంటూరు నుంచి పోటీకి ఎంపీ అభ్యర్థి వెనుకంజ
- బావమరిదికి బదులు బరిలోకి రోశయ్యకు అవకాశం
- పొన్నూరు నుంచి లోక్‌సభకు ఎమ్మెల్యే కిలారి వలస
- పొన్నూరు తెరపైకి మంత్రి అంబటి సోదరుడు మురళీకృష్ణ



మురళీకృష్ణ



గుంటూరు(ఆంధ్రజ్యోతి), పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28: టీడీపీ, జనసేన పొత్తు ఖరారు.. ఆ పార్టీ అధినేతలు ఉమ్మడిగా ఎన్నికలకు శంఖారావం పూరించటంతో వైసీపీలో వణుకు మొదలైందా.. అంటే జరుగుతున్న పరిణామాలు అవును అన్నట్లుగా ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది.. ఇక మార్పులు, చేర్పులు ఒకటి రెండు మినహా ఉండవని సీఎం జగన్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే గుంటూరు లోక్‌సభ పరిధిలోనే ఇద్దరిని మార్చేశారు. గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఇప్పటికే ఖరారైన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి తనయుడు వెంకటరమణ ఇంకా బరిలోకి దిగక ముందే ఓటమి భయంతో పోటీ నుంచి తప్పుకున్నారు. విజయావకాశాలు ఏ మాత్రం లేని గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిని మూటకట్టుకోవటమే కాకుండా రూ.కోట్లు వ్యయం చేసుకోవడం అవుతుందని ఆయన భావించారని సమాచారం. తనను పోటీ నుంచి తప్పించమని అధిష్ఠానానికి మొర పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను తప్పించి ఆ స్థానంలో ఆయన బావ పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్యను బరిలోకి దించారు. విశేషమేమిటంటే పొన్నూరులో విపరీతమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ స్వపక్షం సైతం వ్యతిరేకించిన రోశయ్యకు పదోన్నతి కల్పించి ఎంపీ అభ్యర్థిగా బరి లోకి దించడంపై ఆ పార్టీలోనే నిరసన వ్యక్తమవుతుంది.

కిలారికి పదోన్నతి..

వెంకటరమణ బరిలోకి దిగకుండానే వాకౌట్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన బావ పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్యను గుంటూరుఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించుతున్నట్లు వైసీపీ అధిష్ఠానం బుధవారం ప్రకటించింది. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో తొలిసారి చట్టసభలోకి అడుగుపెట్టిన రోశయ్య స్వపక్షం నుంచే తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకున్నారు. ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని సొంత పార్టీ నాయకులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. అంతేగాక తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి పార్టీ పెద్దలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో రోశయ్య తిరిగి గెలిచే అవకాశాలు ఏ మాత్రం లేవని అధిష్ఠానం భావించింది. అయితే ఉమ్మారెడ్డిపై గౌరవంతో ఇప్పటి వరకు రోశయ్యను కదిలించలేదు. అయితే నెల రోజుల క్రితం ఉమ్మా రెడ్డి తనయుడు వెంకటరమణను గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దించారు. అయి తే ఆయన ఇంత వరకు కార్యరం గంలోకి దిగకుండానే పరారయ్యారు.

రోశయ్య స్థానంలో మురళీకృష్ణ

రోశయ్య స్థానంలో పొన్నూరు వైసీపీ అభ్యర్థిగా మంత్రి రాంబాబు సోదరుడు బిల్డర్ అంబటి మురళీకృష్ణను బరిలోకి దించారు. మురళీకృష్ణ కుటుంబం మూలాలు పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఉన్నప్పటికీ వారు రేపల్లె వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అయితే పొన్నూరు సీటును ఆశిస్తున్న మురళీకృష్ణ ఏడాది కాలంగా మామిళ్లపల్లిలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. భజరంగ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అయితే మురళీకృష్ణ నియామకంపై వైసీపీలోనే భిన్నాభిప్రాయం వ్యక్తమవుతుంది.

టీడీపీ హయాంలో..

- బియ్యం
- పంచదార , కందిపప్పు
- గోధుమలు/గోధుమ పిండి
- పామాయిల్, రాగులు/జొన్నలు/సజ్జలు

వైసీపీ పాలనలో..

- కేంద్రం ఇచ్చే బియ్యం
- అరకేజీ పంచదార (మార్కెట్ ధరతో సమానం)
- అరకొరగా కందిపప్పు



బియ్యం, చక్కెరతో.. సరి

- చతికిల పడిన సరుకుల పంపిణీ
- రేషన్ సబ్సిడీ నిధులను దారి మళ్లించి కోత
- సన్నబియ్యంతో నిత్యావసరాలు ఇస్తామని ప్రగల్భాలు
- కేంద్రం ఇచ్చే బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే సరఫరా
- బహిరంగ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పట్టని వైనం

చెప్పేది పెద్దపెద్ద మాటలు.. చేతల్లోకి వచ్చే సరికి అరకొరగానే అమలు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకుల పంపిణీకి ఇది సరిగ్గా సరిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు బియ్యం, పంచ దార, కంది పప్పు, గోధుమలు/గోధుమ పిండి, పామాయిల్, రాగులు/జొన్నలు/సజ్జలు వంటివి ఇచ్చే వ్యవస్థ ఉండేది. అయితే తాను అధికారంలోకి వస్తే ఆ సరుకులన్నీ కూడా డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి వాటితోనే బతకమని చెబుతున్నారు. వీటిలో కూడా కేంద్రం బియ్యం ఇస్తుండగా.. మార్కెట్ ధరతో సమానంగా ఉన్న అర కేజీ పంచదార కార్డుదారులకు అంద చేస్తున్నారు. ఈ రెండు సరుకుల కోసం ఎండీయూ వాహనం.. దానికో సైరన్.. డ్రైవర్ ఒకరు.. మరొక సహాయకుడు.. వీధుల్లో ఆ వాహనం వద్ద కార్డు దారుల బారులు.. ఇదీ ప్రస్తుతం రేషన్ పంపిణీ తీరు. దీనిపై అటు ప్రతిపక్షాలు, ఇటు కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నా తాము పేదల కోసమే ఉన్నామని వైసీపీ పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు.

రేషన్ సరుకులకు గండి

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తాను అధికారంలోకి సన్న బియ్యంతో పాటు నిత్యా వసర సరుకులను పేదలకు డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత జగన్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికా రంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల 9 నెలల నుంచి కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి వాటితోనే బతకమని చెబుతున్నారు. పేదల గురించి తరచుగా మాట్లాడే సీఎం జగన్ వారికి ప్రతీ నెలా ఇవ్వాల్సిన రేషన్ సరుకుల వద్దకు వచ్చేసరికి నాలిక మడత పెడుతు న్నారు. ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరగబోతోన్నాయని పెద్దపెద్ద మా టలు చెబుతూ పేదలకు హక్కుగా రావా ల్సిన రేషన్ సరుకులకు గండి కొడుతు న్నారు. రేషన్ సబ్సిడీ నిధులను దారి మళ్లించడంతో సరుకులకు కోత పడు తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రం నుంచి వస్తున్న బియ్యాన్ని మాత్రం నెల నెలా కార్డుదారులకు ఇస్తున్నారు. ఇక ఆ ఒక్కదానితో సరిపెడితే బాగుండదేమోనని మార్కెట్ ధరతో సమానంగా ఉన్న అరకేజీ పంచదారను అందచేస్తున్నారు. ప్రభుత్వం గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభు త్వాల హయాంలో ప్రతీ కుటుంబానికి క్రమం తప్పకుండా రేషన్ సరుకులు అందేవి. వాటికి అదనంగా నెలలో మరి కొన్ని సరుకులు బయట తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా పేదలకు భోజన అవ సరాలు తీరిపోయేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. తాను అధికారంలోకి వస్తే 5,10,15, 20, 25 కేజీల బస్తాల రూపంలో వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి ఇస్తారని వాగ్దానం చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు ఒక నెల ఇస్తే మళ్లీ ఎప్పుడు ఇస్తారో, లేదో తెలియని పరిస్థితి. అది కూడా అందరికీ కాకుండా కేవలం కొందరికి మా త్రమే అందుతుంది. ఎవరైనా కార్డుదారు లు కందిపప్పు కావాలని అడిగినా లేదనే సమాధానం ప్రతీ నెల ఎండీయూ వాహనదారుల నుంచి వస్తుంది. గోధుమ పిండి ప్యాకెట్లు అరకొరగా ఇస్తున్నా అవి కొద్ది రోజులకే పురుగు పడుతున్నాయి. దీంతో వినియోగదారులు వాటిని తీసుకోవడం లేదు. పామాయిల్ అసలే ఇవ్వడం లేదు. బియ్యానికి బదులుగా రాగులు/జొన్నలు/సజ్జలు ఇచ్చేవారు. వాటికి కూడా వైసీపీ ప్రభుత్వం శుభంకార్డు వేసింది. ఇలా పేదలకు రేషన్ సరుకుల్లో కోత పెట్టి సబ్సిడీ రూపంలో భరించాల్సిన నిధులను దారి మళ్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

పేదలపై ఆర్థిక భారం

వైసీపీ పాలనలో రేషన్ సరుకుల పంపిణీ పూర్తిగా చతికల పడిందని కార్డుదారులు విమర్శిస్తున్నారు. ఒక వైపు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, నూనెలు, ఇతర నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రణకు చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్‌లో ధరల పెరుగుదలను అడ్డుకునేందుకు రేషన్ ద్వారా ఆయా సరుకులను అందజేసే వారు. దీంతో బహిరంగ్ మార్కెట్‌లో ఆయా సరుకులకు డిమాండ్ తగ్గి ధరలు అందుబాటులోకి వచ్చేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా ప్రభుత్వం ఆలోచనే చేయడం లేదు. దీంతో నిత్యావసరాల ధరలు సామాన్యులకే కాదు మధ్య తరగతివర్గాలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వ తీరుతో ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. మరో వైపు రేషన్ పంపిణీ వ్యవస్థతో పెద్దగా ప్రయోజనం చేకూరడంలేదు. కిలో కంది పప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.200 వరకు పలుకుతుంది. రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే పేదలపై ఆర్థిక భారం తగ్గేది. టీడీపీ పాలనలో ప్రతి నెల కిలో కందిపప్పు రూ.40కి సరఫరా చేసేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ధరను రూ.67కు పెంచింది. అయినా అందరికీ కందిపప్పును సక్రమంగా ఇవ్వడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కిలో పంచదార రూ.14కు ఇచ్చేవారు. జగన్ దానిని అరకిలోకు పరిమితం చేశారు. పైగా ధరను మార్కెట్ ధరతో సమానంగా పెంచేశారు. నాడు రాగులు, జొన్నలు వంటివి కూడా రాయితీపై కార్డుదారులకు ఇచ్చేవారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తదితర పండుగ ల సమయంలో ఆయా వర్గాలకు ప్రత్యేకంగా ఉచితంగా కానుకలు అందజేసి పేదలను ఆదుకునే వారు. అయితే పేదలకు ఎంతో చేస్తున్నామని చెపుతున్న జగన్ పండుగ కానుకలను రద్దు చేశారు. రేషన్ సరుకుల పంపిణీకి ఎండీయూ వాహనాలను లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. ఒక్కొక్క వాహన దారుడికి నెలకు రూ.21 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి కేవలం పంచదార, బియ్యం ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



టీడీపీ హయాంలో పంపిణీ చేసిన నిత్యావసరాలు



దళితుల డీకె పట్టాల భూమ్ములో మైనింగ్ చేసిన దృశ్యం

అన్యాయంపై ఆగ్రహం

- అసైన్డ్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలపై హైకోర్టు ఆగ్రహం
- వీరనాయకునిపాలెంలో 60ఎకరాల్లో అక్రమ మైనింగ్
- దళితుల భూముల్లో అక్రమ మైనింగ్‌పై తీవ్ర నిరసనలు
- మైనింగ్ కొనసాగింపుపై హైకోర్టును ఆశ్రయించిన దళితులు
- హైకోర్టు ఆదేశాలతో అక్రమాల డొంక కదిలేనా ?

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఫిబ్రవరి28: చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామంలో దళితులకు దశాబ్దాల క్రితం ఇచ్చిన డీకే పట్టా భూముల్లో అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. నివేదికలో తేడా ఉంటే మైనింగ్ అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని జారీచేసిన హెచ్చరికలతో మైనింగ్, రెవెన్యూ శాఖ వర్గాలను హడలెత్తిస్తున్నాయి.

వీరనాయకునిపాలెం గ్రామంలో 498 సర్వే నెంబరులో సుమారు 60 ఎకరాల భూమిని 1993లో దళితులకు 50 సెంట్ల చొప్పున పంపిణీ చేసింది. ఆ భూములను సాగుచేసుకోవటం ద్వారా జీవనోపాధిని పొందాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. ఆనాటి నుంచి దశాబ్దాలుగా వందలాది మంది దళిత రైతులు ఈ భూముల్లో కూరగాయలు, పండ్ల తోటలు సాగుచేసుకుంటూ జీవనోపాధిని పొందుతున్నారు. వీరనాయకునిపాలెం సమీపంలోని గ్రామ సరిహద్దుల వెంట శేకూరు గ్రామం ఉంది ఈ గ్రామంలో గత 10, 15 ఏళ్లుగా ఎర్ర గ్రావెల్ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. 2019 తర్వాత గ్రావెల్ మైనింగ్ మాఫియా కన్ను దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములపై పడింది. కొంతమంది చిన్న రైతులను మభ్యపెట్టి ఈ అసైన్డ్ భూముల పట్టాలను చేజిక్కించుకున్న ప్రభుత్వంలోని పెద్దలు, వైసీపీ నాయకులు ఈ భూముల్లో మట్టి తవ్వకాలు ప్రారంభించారు. చిన్న రైతులు ఈ తవ్వకాలపై తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ మట్టి మాఫియా ఆగడాల ముందు వారి నిరసనలు చిన్నపోయాయి. దళితులను నయానో, భయానో బెదిరించి వారు ఆ ప్రాంతాలకు రాకుండా చేయటమే కాకుండా రాత్రివేళ తవ్వకాలు చేపట్టిన మైనింగ్ మాఫియా మట్టిని కొల్లకొట్టి కోట్లు సంపాదించింది. ప్రశ్నించిన రైతులను మైనింగ్ మాఫియా అధికార పార్టీ నాయకుల అండదండలతో బెదిరింపులకు పాల్పడటమే కాకుండా పోలీసులను అడ్డంపెట్టుకొని తిరిగి రైతుల పైనే కేసులు పెట్టి వేధించారు. ఈ అరాచకాలపై దిక్కుతోచని స్థితిలో ఉన్న దళిత రైతులు అధికార పార్టీ అక్రమాలపై పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను ఆశ్రయించారు.



మైనింగ్‌ను అడ్డుకొని నిరసన తెలుపుతున్న దళితులు (ఫైల్ ఫోటో)

కేజీఎఫ్ చాప్టర్ - 3 డాక్యుమెంటరీతో...

నరేంద్రకుమార్ రెండు రోజుల పాటు వీరనాయకునిపాలెం గ్రామంలో అక్రమ మైనింగ్ బాగోతాలను వెలికితీసేందుకు పాదయాత్ర చేపట్టారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను మైనింగ్ ప్రాంతాలకు పిలిపించి అక్కడ జరుగుతున్న అక్రమమైనింగ్‌ను వెలికితీశారు. సుమారు 60 ఎకరాల అసైండ్ భూముల్లోవందల అడుగుల లోతులో అక్రమ మైనింగ్ సాగిందని గుర్తించిన టీడీపీ నాయకులు, దళితల రైతులకు అండగా నిలిచారు. దీనిపై కేజీఎఫ్ చాప్టర్ - 3 పేరుతో డాక్యుమెంటరీ రూపొందించటమే కాకుండా ఫొటోలు తీసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులను రైతులు ఆశ్రయించేలా ప్రోత్సహించారు. వీరనాయకునిపాలెం గ్రామానికి చెందిన ఎం.ప్రభుదాస్ మరికొంత మంది పట్టాదారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈ పిటిషన్‌కు వాస్తవాలతో కూడిన చిత్రాలను జతచేసి హైకోర్టు ముందు ఉంచారు. బుధవారం జరిగిన విచారణలో హైకోర్టు అక్రమ మట్టి తవ్వకాలపై కీలక వ్యాఖ్యలు చేయటంతోపాటు రెండువారాల్లోగా వాస్తవ నివేదికలను వెల్లడించాలని ఆదేశించటంతో అధికారుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి. గతంలో కూడా కొందరు రైతులు అక్రమ మైనింగ్‌పై హైకోర్టును ఆశ్రయిస్తే క్వారీ గుంతలో నీళ్ల ఉన్నాయని కొలతలు వేసి తవ్వకాల వివరాలను అందించటానికి వీలు లేదని నివేదికను ఇచ్చి తాత్కాలికంగా ఉపసమనం పొందారు. అయితే తాజాగా హైకోర్టు మైనింగ్ అధికారులు వాస్తవ నివేదిక ఇవ్వకపోతే మెజిస్టీరియల్ కమిటీని ఏర్పాటు చేసి మైనింగ్ ప్రాంతానికి పంపించి నివేదిక తెప్పించుకుంటామని వ్యాఖ్యానించటంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇనాళ్ల తాము కొమ్ముకాసిన మైనింగ్ మాఫియాను తమను కాపాడాలన్ని శరణు వేడుతున్నట్లు సమాచారం.

అక్రమ మైనింగ్‌పై ధర్మాసనం వదిలిపెట్టదు : ధూళిపాళ్ళ

గత ఐదేళ్లుగా వీరనాయకునిపాలెం అసైండ్ భూములో జరిగిన అక్రమ మైనింగ్‌పై అధికార మదంతో అక్రమార్కులు తప్పించుకోవాలనుకున్న హైకోర్టు ధర్మాసనం వదిలిపెట్టదని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. డీకే పట్టాలో అక్రమ మైనింగ్‌పై హైకోర్టు స్పందించి విచారణకు ఆదేశించటాని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. వైసీపీ గ్రావెల్ మాఫియాపై తాము ఐదేళ్లుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదన్నారు. చివరకు హైకోర్టు మొట్టికాయలు వేస్తే కానీ గనుల శాఖ అధికారులు కదిలే పరిస్థితి రాలేదన్నారు. పేద రైతులకు జగన్ అండ్ కో చేసిన అన్యాయానికి ధర్మక్షేత్రంలోనూ, ప్రజాక్షేత్రంలోనూ శిక్ష తప్పదని నరేంద్రకుమార్ అన్నారు.

2న గురజాలలో..
రా కదలిరా

- సభలో శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- నేడు వేదికను ఖరారు చేయనున్న నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రా కదలిరా.. బహి రంగ సభ మార్చి 2 శనివారం గురజాలలో ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాసరావు బుధవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గురజాలలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలి పారు. సభా ప్రాంగణం ఎక్కడ అనేది గురువారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి నిర్ణయిస్తామన్నారు. తొలుత మార్చి 2, 3 తేదీల్లో నరసరావుపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే నరసరావుపేటలో జరగాల్సిన సభను శనివారం గురజాలలో నిర్వహించేందుకు పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఈ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశా నిర్దేశం చేయనున్నారు.



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెమ్మసాని కుటుంబంతో ఎన్నో ఏళ్ల అనుబంధం

- కష్టపడి పనిచేయటం, వెనకడుగు వేయనితత్వం ఆయన నైజం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 28: పెమ్మసాని కుటుంబంతో తెలుగుదేశం పార్టీకి ఎన్నో ఏళ్లుగా అనుబంధం వుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం టీడీపీ నేతలతో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమానికి టీడీపీ గుంటూరు పార్లమెంటు నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేయడంలో పెమ్మసాని వెనుకడుగు వేసే వ్యక్తి కాదన్నారు. పనిచేసే వ్యక్తికి ప్రోటోకాల్‌తో పనిలేదని, తనకు పార్టీపరంగా గ్రౌండ్‌వర్క్ చేయడమంటే ఎంతో ఇష్టమన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కుప్పం, మంగళగిరి నియోజకవర్గాలు ఎంతో అదృష్టం చేసుకున్నాయని చెప్పారు. ఎన్నో చోట్ల పోటీ చేసే అవకాశం వున్నా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గాన్నే ఎంచుకోవడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలను ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నుంచి లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీశ్రేణులు కృషిచేయాలని పెమ్మసాని కోరారు.



టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ నేతలతో నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్

లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు ..

మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. వైసీపీకి రాజీనామా చేస్తున్న నేతలు యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా, వైసీపీ యువజన విభాగం మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ, మరో 60 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. ఉండవల్లి లోని నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. లోకేశ్ వీరికి పార్టీ కండువాలనుకప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, వైసీపీ దుశ్చర్యలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని లోకేశ్ వారికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు నేత పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పడవల మహేష్ పాల్గొన్నారు.

పసుపు.. మిలమిల

- రికార్డు స్థాయిలో పసుపు దిగుబడులు
- ఎకరాకు 300 బస్తాల దిగుబడి వచ్చిందంటున్న రైతులు



అరకతో పసుపు దున్నుతున్న కూలీ ,



కొల్లూరు, ఫిబ్రవరి 28: ఓ రైతు రికార్డు స్థాయిలో పసుపు దిగుబడులు సాధించాడు. కొల్లూరు మండలంలోని పోతార్లంక గ్రామానికి చెందిన ఈడ్పుగంటి కుటుంబరావు ఐదెకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేశాడు. మునుపెన్నడూ చూడని విధంగా పసుపు కొమ్ములు ఊరడంతో అత్యధిక దిగుబడులు వస్తున్నాయని చెబుతున్నాడు. సేలం పసుపు విత్తనాన్ని ఎకరాకు సుమారు పది క్వింటాళ్ల వరకు విత్తానని, ఎకరాకు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు పంటపై పెట్టుబడులు పెట్టానని అన్నారు. ఒక్కో ఎకరాకు 75 కిలోల బస్తా చొప్పున 300 బస్తాల పసుపు వచ్చినట్లు పేర్కొన్నారు. పచ్చి పసుపు వండిన అనంతరం ఎకరాకు 50 క్వింటాళ్లు దిగుబడి ఆశిస్తున్నట్లు చెప్పారు. అరకతో దున్నగా వచ్చిన పసుపును పోగు చేసేందుకు రోజు 70మంది కూలీలు అవసరమైనట్లు ఆయన తెలిపారు. గతంలో క్వింటా పసుపు రూ.5 నుంచి రూ.7 వేలు వరకు ధర పలుకగా, ప్రస్తుతం వండిన పసుపు క్వింటా రూ.12 వేలకు వ్యాపారులు యార్డులో కొనుగోలు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో పసుపు ధర రూ.15 వేలు వరకు కూడా పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గతం కంటే అధిక దిగుబడులు...

కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో ఈ ఏడాది పసుపు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు పొందుతున్నారు. గతంలో ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రస్తుతం చేస్తున్న పసుపు తవ్వకాల్లో కొమ్ములు బాగా ఊరడంతో ఎకరాకు 30 క్విం టాళ్ల పైనే దిగుబడి రావచ్చని రైతులు చెబుతున్నారు. గతంలో పసుపు సాగుచేసి దెబ్బతిన్న రైతులు ఈఏడాది దిగుబడులపరంగా, ధర పరంగా కూడా ఆశాజనకంగా ఉండటంతో గతంలో పంటలపై పెట్టిన పెట్టుబడుల రుణాలను తీర్చుకునే విధంగా పసుపు దిగుబడులు వస్తున్నాయని పసుపు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





దున్నిన పసుపును ఏరుతున్న కూలీలు , రైతు కుటుంబరావు (ఇన్‌సెట్లో)

చీరలిస్తాం.. ఓటెయ్యండి..

రాజుపాలెం, ఫిబ్రవరి 28: ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఓటర్లకు తాయిలాలు పంచే కార్యక్రమానికి వైసీపీ నేతలు తెర తీశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రెండు రోజుల కిందట వైసీపీ ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, స్థానిక వైసీపీ నాయకులు వేల్పుల వెంకటేశ్వర్లు, స్థానిక వలంటీరుతో కలిసి చీరల పంపిణీకి సిద్ధపడ్డారు. ఇంటికో చీర ఇస్తామంటూ దాదాపు వెయ్యి చీరలను తీసుకుని తిరిగారు. కొందరు ఓటర్లు ఈ చీరలను తీసుకోగా టీడీపీ వర్గీయులు మాత్రం వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. మాకు వద్దు అని గట్టిగా చెప్పటంతో అధికార పార్టీ నేతలు జారుకున్నారు.

చిరువ్యాపారులకు.. ఆశీలు ఫీజు రద్దు చేస్తాం



యూరో కార్ట్ ట్రైనింగ్ మాడ్యూల్‌ను ఆవిష్కరిస్తున్న లోకేశ్ తదితరులు

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- మంగళగిరిలో యూరో కార్టు సేవలకు శ్రీకారం
- 50 మంది చిరు వ్యాపారులకు కార్టులు పంపిణీ

మంగళగిరి, ఫిబ్రవరి 28: టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరువ్యాపారులకు ఆశీలు ఫీజును రద్దు చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో చిరువ్యాపారుల జీవనోపాధికి వివిధ రూపాల్లో చేయూతనిస్తున్న యువనేత లోకేశ్ మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. చిరువ్యాపారుల ఆదాయాన్ని కనీసం 50 శాతం పెంచే దిశగా ఎన్నారై టీడీపీ సహకారంతో అధునాతన యూరో కార్టు సేవలను బుధవారం ప్రారంభించారు. రోడ్లవెంబడి టిఫిన్ బండ్లపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు పాశ్చాత్య దేశాల్లో మాదిరి అధునాత సదుపాయాలతో కూడిన యూరో కార్టులను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమం పేరిట కుడిచేత్తో రూ.పది ఇచ్చి.. ఎడమ చేత్తో రూ.వంద లాగేస్తున్నారని విమర్శించారు. వీధి వ్యాపారులకు వడ్డీలేని రుణాల పేరుతో రూ.పది వేలు ఇస్తూ.. అదే సమయంలో ఆశీలు పేరుతో ఏటా రూ.10,800 దోచేస్తున్నారని ఆరోపించారు. చిరువ్యాపారులు ఎక్కడైతే రోజువారీ బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారో వారికి అక్కడే లైసెన్సులు ఇచ్చి పోలీసు వేధింపులు లేకుండా చేస్తామన్నారు. బండ్ల వద్ద చెత్తను మునిసిపాలిటీల ద్వారా సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యూరో కార్టులు పొందిన లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా వర్కింగ్ క్యాపిటల్ సమకూరుస్తున్నందున అడ్డగోలు వడ్డీల బెడద వుండదన్నారు. శుభ్రత విషయంలో వెస్టిన్ హోటల్ మేనేజ్‌మెంట్ వారిచే 5స్టార్ హోటళ్లకు దీటుగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, ఎన్నారై టీడీపీ ప్రతినిధులు గుంటుపల్లి జయకుమార్, మురళీ రాపర్ల, యూరో కార్ట్ డిజైనర్ కృష్ణంరాజు, వెస్ట్ ఇన్ ట్రైనర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరోకార్టు ప్రత్యేకతలెన్నెన్నో..

అధునాతనంగా రూపొందించిన యూరోకార్టులు తేలికగా శుభ్రం చేసుకోవడానికి అనువుగా వుంటాయి. శుభ్రత విషయంలో స్టార్ హోటళ్లకు దీటుగా వెస్టిన్ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్ తరపున చిరువ్యాపారులకు ఉచితంగా శిక్షణ ఇస్తారు. చిరువ్యాపారులకు అవసరమైన రోజువారీ సరుకులను ఆర్డర్‌పై వేర్వేరు బ్రాండెడ్ స్టోర్స్ వారు బండి వద్దకే పంపేలా ఏర్పాట్లు చేశారు. ఈ లావాదేవీలకు అవసరమైన బ్యాంకు సేవలను హెచ్‌డీఎఫ్‌సీ వారు అందిస్తారు. రోజువారీ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతోపాటు యూరోకార్టు స్క్రీన్‌పై ప్రకటనల ద్వారా కూడా మరికొంత ఆదాయం పొందే అవకాశం వుంది. ఎన్నారై టీడీపీ ప్రతినిధులు గుంటుపల్లి జయకుమార్, మురళీ రాపర్ల సహకారంతో ఈ పైలట్ ప్రాజెక్టును బుధవారం ఉండవల్లిలోని నివాసం వద్ద నారా లోకేశ్ లాంఛనంగా ప్రారంభించారు. చిరువ్యాపారుల ఆదాయంతోపాటు జీవన ప్రమాణాలు పెంచేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాబోయే ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం మొత్తం విస్తరించాలని భావిస్తున్నట్టు లోకేశ్ తెలిపారు. తొలి దశలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో 50 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి యూరో కార్టులు అందించారు. వారిలో కొంత మంది లబ్ధిదారులకు బుధవారం లోకేశ్ చేతుల మీదుగా యూరోకార్టులను అందజేశారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల బాహాబాహీ

- ఫ్లెక్సీల ఏర్పాటుపై చెలరేగిన వివాదం
- ఎనిమిది మందికి గాయాలు

మాచర్ల, ఫిబ్రవరి 28: ఫెక్సీల ఏర్పాటుపై చెలరేగిన వివాదంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లతో దాడికి దిగడంతో ఇరువర్గాలకు చెందిన 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని తూర్పు బావి జెండా చెట్టు ప్రాంతంలో బుధవారం సాయంత్రం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించేందుకు పార్టీ నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మధ్యాహ్న సమయంలో టీడీపీ నేతలు ఆ ప్రాంతంలో తమ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలు ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో వైసీపీ నేతలు ఆ ఫ్లెక్సీలను చించారు. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం చెలరేగింది. అనంతరం ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన మోసిన్, ముజుఫర్, నాసిర్, జానిలకు గాయాలు కాగా వైసీపీకి చెందిన అహ్మద్, నాగుల్‌మీరా, యూసుఫ్, అంగర్‌బాషాలకు గాయాలయ్యాయి. గాయపడిన వైసీపీ నేతలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా టీడీపీ నేతలు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ శరత్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

వైసీపీ నేతలు ధర్నా... దాడిని ఖండిస్తూ ఆ పార్టీ నేతలు పట్టణంలోని పార్కు సెంటర్ వద్ద ధర్నాకు దిగారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శరత్‌బాబు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో వైసీపీ నేతలు ధర్నా విరమించారు.

ప్రజాదరణ ఓర్వలేకే చిచ్చు

- టీడీపీ నేతలపై అసత్యపు ప్రచారం
- టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి



టీవీలో వీడియో చూపుతూ మాట్లాడుతున్న టీడీపీ మాచర్ల ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 28: టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పట్టణంలోని ముస్లిం గడ్డపై చిచ్చు పెట్టాలని చూస్తున్నారని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తూర్పుబావి జెండా చెట్టు వద్ద జరిగిన ఘర్షణపై స్పందించారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జెండా చెట్టు వద్ద జరిగిన ఘర్షణలో టీడీపీ నేతలు దాడి చేశారని అధికార పార్టీ నేతలు అసత్యపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ఆడడంలో స్థానిక ఎమ్మెల్యే పీఆర్కే ఘనపాటి అని, పల్లెటూరు నుంచి వచ్చి దాడి చేశారని ప్రచారం గావిస్తున్నారని, ఆ ఘర్షణలో పల్లెటూరు వాళ్లు ఎవరున్నారో రుజువు చేయాలన్నారు. టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక మసీదు సెంటర్లో కర్రలు దాచిపెట్టి దాడి చేశారన్నారు. పథకం ప్రకారం తమ పార్టీ నేతలపై దాడి చేశారని, లేకుంటే మసీదుకు వెళ్లేవారు కర్రలు, కత్తులతో వస్తారా అని ప్రశ్నించారు. తమ పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు పెడితే పోలీసు శాఖపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

అధర్మం నాలుగు పాదాల మీద నడక

- మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత బాలశౌరి



గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పరిపాలనలో అధర్మం నాలుగు పాదాల మీద నడుస్తున్నదని మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత వల్లభనేని బాలశౌరి ఆరోపించారు. ఎక్కడ చూసినా అధర్మం, అన్యాయం, అక్రమం రాజ్యమేలుతున్నాయి. ఆ పార్టీ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు బయ టకు వస్తుండటానికి ప్రధాన కారణాలు ఇవేనన్నారు. ఎవరైనా ఏదైనా మాట్లాడితే వెంటనే వాళ్ల మీద ఎదురుదాడికి దిగడం, నేతలతో తిట్టించడం పరిపాటైపోయిందన్నారు. బుధవారం గుంటూరు నుంచి తన అనుచరులతో కలిసి తాడేపల్లిగూడెం జెండా బహిరంగ సభకు ఆయన బయలుదేరుతూ పాత్రికేయులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభకు మచిలీపట్నంలోని అన్ని నియోజకవర్గాల నుంచి వెయ్యి కార్లలో జనసైనికులు బయలుదేరారని చెప్పారు. వైసీపీ విముక్తిని ప్రజలు కోరుకొంటున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వా మ్యం, స్వేచ్ఛ ఉండాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. భయాందోళనలో ఉన్న ప్రజలకు భరోస కల్పించేందుకే తాడేపల్లిగూడెంలో లక్షలాది మంది టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలతో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు జనసేనాని పవన్ కల్యాణ్ ఏమి నిర్ణయం తీసుకొన్నా తామంతా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. వైసీపీ బాధితులంతా టీడీపీ -జనసేనకూటమితో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు. తప్పక స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకొందామన్నారు. ఎన్నికల సమయంలో సీట్లపంపిణీ సందర్భంగా ఏ పార్టీలోనైనా అసంతృప్తులు సహజమని, పోలింగ్ నాటికి అవన్నీ సర్దుకొంటాయన్నారు. ఇప్పుడు టిక్కెట్ రాలేని వారికి భవిష్యత్తులో రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ల ఛైర్మన్, ఇతర నామినేటెడ్ పదవులు కల్పించి తగినరీతిలో గౌరవిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేదిలేదు. పోలవరం ప్రాజెక్టుని గత ప్రభుత్వం 75 శాతం నిర్మిస్తే వైసీపీ ఐదేళ్లలో కనీసం 5శాతం కూడా నిర్మాణం చేయలేదు. అసలు ఆ ప్రాజెక్టుని ఎలా పూర్తి చేయాలనే నిర్ణయమే తీసుకోలేదు. తాను జలజీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి మచిలీపట్నంకు రూ.200 కోట్లు తీసుకొస్తే కనీసం మ్యాచింగ్ గ్రాంటుని వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని చెప్పారు. తాను మచిలీపట్నం నుంచి తిరిగి గెలిచి రాబోయే ఐదేళ్లలో బందరు - రేపల్లె రైల్వే లైను, గుడివాడ - కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ హైవే తదితర ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

జగన్ మాట తప్పాడు.. మడమ తిప్పాడు

- మద్యం ఆదాయంలో రూ.లక్ష కోట్లు దోచేసిన సీఎం
- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 28: మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే ప్రజలను ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్‌రెడ్డి ఆ హామీ అమలులో మాట తప్పాడని, మడమ తిప్పాడని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో మద్యం రేట్లు మూడు రెట్లు పెంచారని, సీఎం జగన్‌రెడ్డి 57 నెలల పాలనా కాలంలో సుమారు రూ.2 లక్షల కోట్లు విలు వైన నాసిరకం మద్యం అమ్మి రూ.1 లక్ష కోట్లు ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించాడని ఆరోపించారు. రాష్ట్రంలో నాసిరకం మదం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 30 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యారన్నారు. నాసిరకం మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల బారినపడిన యువత అన్యా యమై పోతున్నారన్నారు. అత్యాచారాలు, నేరాలు, భారీగా పెరిగాయన్నారు. రాబోయే 15 ఏళ్ళ పాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తెచ్చి సీఎం జగన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో దాచారని ఆరోపించారు. ప్రభుత్వ మద్యంషాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని, డిజిటల్ చెల్లింపులు ఎందుకు చేయటంలేదని ప్రశ్నించారు. నాసిరకం మద్యం అమ్మకాల్లో సీఎం జగన్ ఒక్కడే రూ.లక్ష కోట్ల కమీషన్ కొట్టివేశాడని, మిగతా వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారన్నారు. ఈ దందా అంతా జగన్, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందన్నారు. నాసిరకం మద్యం పోవాలంటే, మహిళల మాంగాల్యాలు నిలవాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని, టీడీపీ - జనసేన కూటమిని గెలిపించాలని అనగాని ప్రజలను కోరారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

వైసీపీ పాలనలో అంతా దగాయే !

- రాజధానికి భూములిచ్చిన రైతులను మోసం చేసిన జగన్‌రెడ్డి
- 1534 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు ఫిబ్రవరి 28: వైసీపీ పాలనలో అంతా దగాయేనని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధ వారం నాటికి 1534వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రానికి మూడు రాజధానులు వద్దు, అన్ని వర్గాల ప్రజలు అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అవరావతిని నిర్వీర్యం చేయాలనే సీఎం జగన్‌రెడ్డి దుశ్చర్యను దేశం మొత్తం ఖండించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి మూడు రాజధానులు ఉన్నాయో జగన్‌రెడ్డి చెప్పాలన్నారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ఏ పని ఆయన చేయలేదన్నారు. దీంతో అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన సిగ్గురావటం లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి , జై అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

మహిళా కౌలు రైతు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక ఉరివేసుకున్న వైనం

పెదనందిపాడు, ఫిబ్రవరి 28: మండలంలోని రావిపాడులో అప్పుల బాధతో ఓ మహిళా కౌలురైతు బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు సామ్రాజ్యం(43) కూలి పనులు చేసుకుంటూ ఉండేది, గతంలో 5 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశారు. సరైన దిగుబడి లేక అప్పులపాలవగా ఈ ఏడాది ఒక ఎకరం మాత్రమే కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేసింది. భారీ వర్షాలకు, తామర పురుగు బెడదతో పంట పూర్తిగా దెబ్బతినడంతో వీకేసి పొగాకు సాగు చేశారు. తెచ్చిన అప్పులు తీరుతాయో లేదోనని మనోవేదనకు గురై వేకువజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ రాజకుమార్ చేరుకొని వివరాలు సేకరించారు. భర్త సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

1,39,349 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,16,503 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,39,349 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 96,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	20000
నెంబరు. 5	12000	17000
273	9000	19500
341	8500	20500
4884	8500	17800
సూపర్ 10	11500	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10500	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	12500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

తాడేపల్లిగూడెం సభతో వైసీపీకి చరమగీతం

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెం సభ వైసీపీ పాలనకు చరమగీతం పాడిందని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ- జనసేన పొత్తుతో వైసీపీ నాయకులకు నిద్ర పట్టడం లేదని గూడెం సభతో, తాడేపల్లి ప్యాలెస్ బీటలు వారాయన్నారు. సభను అడ్డుకోవ డానికి ప్రభుత్వం అనేక ఆటంకాలు సృష్టించడం, ఆర్టీసీ బస్సులు ఇవ్వడానికి నిరాకరించడం, సొంత బస్సులు ఏర్పాటు చేసుకుంటే అడ్డుకోవడం వంటి నీచ చర్యలకు బుదలిస్తూ లక్షలాది మంది సభకు తరలివచ్చారన్నారు. టీడీపీ- జనసేన పొత్తును చూసి జగన్ రెడ్డికి ఎందుకంత భయం అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తుందని వైసీపీ అరాచకాలకు గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. ఈ సభకు లక్షలాదిమంది ప్రజలు తరలివచ్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కోసం మద్దతు తెలపడంతో వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలందరూ మాకొద్దు ఈ జగన్ అంటున్నారని, సభకు వచ్చిన జన సందోహమే అందుకు నిదర్శన మన్నారు. టీడీపీ జనసేన పొత్తు సూపర్ హిట్ అని, ఇక జగన్ సినిమా అయిపోయిందని, ప్రజలే అంటున్నారని డేగల అన్నారు.

సీఎం కార్యాలయం ముట్టడికి అనుమతి లేదు

● అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు

● ఎస్పీ తుషార్ డూడి హెచ్చరిక

గుంటూరు, ఫిబ్రవరి 28 : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సీపీఐ, వాటి అనుబంధ విభాగాలు ఆధ్వర్యంలో మార్చి 1న నిర్వహించ తలపెట్టిన సీఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి ఇటువంటి అనుమతి లేదని ఎస్పీ తుషారు డూడీ స్పష్టంచేశారు. ముట్టడి కార్యక్రమ నిర్వహణ కోసం అయా పార్టీల నేతలు ఎవరూ దరఖాస్తు చేయలేదని, వారికి ఏ అనువతి ఇవ్వలేదని తెలిపారు. మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలో ముఖ్య అధికారులు, ప్రభుత్వ సముదాయాలు ఉన్నందున 30 పోలీసు చట్టం, సెక్షన్ 144 సెక్షన్ అమలులో ఉన్నాయన్నారు. ఈ క్రమంలో అందోళనలు నిర్వహించుట, పెద్ద ఎత్తున గుమిగూడుటం వంటివి నిషేదం అన్నారు. ఎవరైనా పోలీస్ ఆదేశాలను ధిక్కరించి కార్యక్రమంలో పాల్గొంటే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బకెట్లో నీట మునిగి 17 నెలల చిన్నారి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 28 : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్.అగ్రహారంలో 17నెలల చిన్నారి బకెట్ నీటిలో మునిగి మృతి చెందిన దుర్ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ అగ్రహారంకు చెందిన ప్రజాపత్ మనోహర్, గీత దంపతులకు 17 నెలల ప్రజాపత్ రుద్రాంశ్‌తో పాటు, నెల వయసు చిన్నారి సంతానంగా ఉన్నారు. బుధవారం ఉదయం గీత తన నెల వయసువున్న చిన్నారికి పాలు ఇస్తుండగా రుద్రాశ్ బాత్రూంలోకి వెళ్లాడు. గంట సమయం తర్వాత రుద్రాంశ్ కనిపించక పోవడంతో తల్లి బాత్రూంలోకి వెళ్లి చూడగా బకెట్లో నీటి మునిగి మృతి చెంది ఉన్నాడు. ఆడుకుంటూ బకెట్లో జారిపడి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న తిలక్‌బాబు తదితరులు

పేద విద్యార్థులకు ఎస్ఎఫ్ఆర్ఎస్ చేయూత

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 28: ఎన్నారై విద్యా సంస్థలో అంతర్భాగమైన సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ (ఎఫ్ఎఫ్ఆర్ఎస్) ఆధ్వర్యంలో బీ.టెక్, లా చదువుతున్న నలుగురు పేద విద్యార్థులకు ఈసంవత్సరానికి గాను చివరి విడతగా ఒక లక్ష రూపాయలు ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. విద్యానగర్‌లోని ఎన్నారైస్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో సంస్థ సీఏవో మన్న వరప్రసాద్, రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ప్రెసిడెంట్, ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు చేతులమీదుగా విద్యార్థులు పీ.హేమంత్ సాయి, పీ.పూజిత, కే.అంజిలకు నగదు అందజేశారు.

పెన్షన్ రకాలపై అవగాహన అవసరం

గుంటూరు, ఫిబ్రవరి 28: అమలులో ఉన్న వివిధ రకాల పెన్షన్‌ల గురించి అవగాహన కలిగి ఉండటం అవసరమని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్ వ్యాలిడ్ పెన్షన్, కాంపెన్‌సేషన్ పెన్షన్, కంపల్సరీ రిటైర్‌మెంట్ పెన్షన్ అని మూడు పెన్షన్‌ల వివరాలను తెలియజేశారు. ఇన్‌వ్యాలిడ్ పెన్షన్- ఒక ఉద్యోగి అతను చేస్తున్న ఉద్యోగం చేయలేడని మెడికల్ అథారిటీ డిక్లేర్ చేస్తే అతనికి రూల్ -45 కు లోబడి ఇన్‌వ్యాలిడ్ పెన్షన్ మంజూరు చేస్తారన్నారు. అయితే మెడికల్ అథారిటీ ఉద్యోగి ఇప్పుడు చేస్తున్న పని కంటే తక్కువ శ్రమ కలిగిన పని చేయగలడు అని భావిస్తే అతన్ని ఆ పోస్టులో నియమించవచ్చన్నారు. ఆ పనిచేయటానికి అతినికి ఇష్టం లేకపోతే అప్పుడు అతినికి ఇన్‌వ్యాలిడ్ పెన్షన్ మంజూరు చేస్తారన్నారు. కాంపెన్‌సేషన్ పెన్షన్ - ఏదైనా పర్మినెంట్ పోస్టు రద్దయినప్పుడు అతనికి ఎటువంటి ఇతర ఉద్యోగం చూపనప్పుడు అతనికి మంజూరు చేసేపెన్షన్‌ను కాంపెన్‌సేషన్ పెన్షన్ అని పిలుస్తార న్నారు. ఒక వేళ వేరే ఉద్యోగం చూపిస్తే అంత క్రితం సర్వీసును పెన్షన్‌ను లెక్కించటటానికి పరిగణిస్తారన్నారు. కంపల్సరీ రిటైర్డ్‌మెంట్ పెన్షన్ - ఉద్యోగి చేసిన తప్పులకు శిక్ష రూపంలో అతినిని సర్వీసు నుంచి కంప్ప లరీగా రిటైర్డ్ చేస్తే ఆ సందర్భంలో కంపల్సరీ రిటైర్డ్‌మెంట్ పెన్షన్ మంజూరు చేస్తారన్నారు. రిటైర్డ్ అయిన రోజుకు అతనికి వచ్చే పెన్షన్‌లో 2/3 తగ్గకుండా, ఇన్ వ్యాలిడ్ పెన్షన్ కంటే ఎక్కువ కాకుండా రూల్ -39 ప్రకారం మంజూరు చేస్తారన్నారు. అంతకంటే తక్కువగా మంజూరు చేయటానికి ముందు ఏపీపీఎస్‌సీ సమ్మతి తీసుకోవాలని వీరయ్య తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, ఫిబ్రవరి 28: ఆర్టీసీపరమైన సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు డయ ల్ యువర్ ఆర్టీసీ గుంటూరు-1 డీఎం కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని అమరావతి, క్రోసూరు, తుళ్ళూరు, 75 తాళ్ళూరు, పర్చూరు రూట్లలో ప్రయాణించే వారు బస్సు వేళల్లో మార్పులు లేదా అదనపు బస్ ట్రిపుల కోసం, సిబ్బంది ప్రవర్తనపై ఫిర్యాదులు, సలహాలు, సూచనల కోసం 9959225420 నబరుకు ఫోన్‌చేసి సంప్రదించాలని కోరారు.

సిరి ధాన్యాలపై నేడు ముఖాముఖి సభ

గుంటూరు, ఫిబ్రవరి 28: సంపూర్ణ ఆరోగ్యంపై సిరిధాన్యాలు అనే అంశంపై ఆహార నిపుణులు, వైద్యులు పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి నేతృత్వంలో గురువారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు స్థానిక అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో ముఖాముఖి సభ నిర్వహించనున్నట్లు అవగాహన సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిరి ధాన్యాలతో ప్రజలు ఆరోగ్యం పొందాలని ఆయన సూచించారు.

17,441 క్లెయిమ్‌లను పరిష్కరించాలి



● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి వెల్లడి

● ఓటర్ల జాబితాపై పార్టీల నేతలతో సమావేశం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 28 : ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం జనవరి 23 నుంచి అందిన 17,441 క్లెయిమ్‌లను పరిశీలించి పరిష్కరించాల్సి వుందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో శ్రీఖర్ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితా తుది ప్రచురణ అనంతరం ఫారం 6,7,8 లకు సంబంధించి మొత్తం 50,776 క్లెయిమ్స్ అందాయని, వీటిలో 33,335 క్లెయిమ్స్ పరిష్కరించామన్నారు. మిగిలిన 17,441 క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, లోకేషన్ చేంజ్, 1500 ఓట్లు వున్న చోట కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఈఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కౌంటింగ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి వివిధ పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలకు ఈఆర్వోలు ఎప్పటికప్పుడు వివరణ ఇవ్వాలన్నారు. కొన్ని నియోజకవర్గాల నుండి ఫారం-8 క్లెయిమ్స్ అందుతున్నాయని, వీటిపై ఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధతో వాటిని పరిష్కరించాలన్నారు. అందిన దరఖాస్తుల వివరాలను తెలియజేసి, వీటిని నిర్దేశించిన సమయానికి పరిష్కరించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి టీంలను ఏర్పాటుచేసి శిక్షణ అందించినట్లు తెలిపారు. ఓటరు జాబితాపై, దరఖాస్తుల పరిష్కారంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన అంశాలు, అభ్యంతరాలను ఈఆర్వోలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర రావు, లక్ష్మీకుమారి, జీఎంసీఏసీ రాజ్యలక్ష్మీ, పీడీ డీఆర్‌డీఏ హరిహరనాథ్, తహసీల్దార్లు శ్రీనివాసులరెడ్డి , జీ.రాఘవేంద్ర రావు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలి

జిల్లాలో పేదలందరికీ మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ జీ రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరితో కలసి జగనన్న పాలవెల్లువ, పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, ఇళ్ళ నిర్మాణం, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక అధికారు, తహసీల్దారు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈసీ మార్గదర్శకాల మేరకు

పోలింగ్ కేంద్రాల్లో మార్పులు

● బీఎల్వోల ద్వారా పార్టీలకు, ఓటర్లకు తెలియజేస్తాం

● నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 28 : భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కారణంగా ఏమైనా మార్పులు చేస్తే వాటి వివరాలను బీఎల్వోల ద్వారా ఓటర్లకు తెలియచేస్తామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తిచేకూరి తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్-2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలను మార్చాల్సివుంటే వాటిని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఓటర్లకు తెలియచేస్తామన్నారు. మార్చిన కేంద్రం పరిధిలోని ఓటర్లకు వివరించి, వారినుండి సంతకాలు కూడా తీసుకోవాలని బీఎల్వోలను ఆదేశిస్తామని తెలిపారు. ఈ నెల 19 నుండి 25 వరకు తూర్పు నియోజకవర్గంలో 339, పశ్చిమ నియోజకవర్గంలో 510 వివిధ క్లెయిమ్‌లు అందాయని, వాటిని బీఎల్వోలు, సూపర్‌వైజరీ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలించి ఇచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో, అదనపు కమిషనర్ కే.రాజ్యలక్ష్మీ, ఏఈఆర్వోలు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి



పశ్చిమ ఆర్వో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అర్హుల ఓటు దరఖాస్తుల తిరస్కరణ తగదు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు

● పశ్చిమ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మికి ఫిర్యాదు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 28: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉండగా, అందుకు విరుద్ధంగా కుంటిసాకులు చూపుతూ దరఖాస్తులు తిరస్కరించటం తగదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామప్రసాద్ అన్నారు. ఈమేరకు బుధవారం వారు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.రాజ్యలక్ష్మిని కలిసి వారు సమస్యలను వివరించారు. అనంతరం కనపర్తి విలేకరులతో మాట్లాడుతూ అధికారుల వైఖరి వింతగా, అధికారపార్టీకి అంటగాగే విధంగా ఉందన్నారు. చిరునామా మారినవారు ఆధార్ కార్డులో అడ్రస్ మార్చుకొని ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని కూడా తిరస్కరించటమేంటని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ అధికారులు మంత్రి రజిని కనుసన్నల్లో పనిచేస్తూ ఓట్ల నమోదులో అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం మారిన తర్వాత వారి పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని హెచ్చరించారు. కార్పొరేటర్ శ్రీరామప్రసాదు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఆర్వో అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని, అదేమని ప్రశ్నిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోమని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకుడు పఠాన్ ఆస్మతుల్లా తదితరులు పాల్గొన్నారు

నాసిరకం వస్తువుల వాడకాన్ని నివారించాలి

● డీపీవో శ్రీదేవి ● భారత జాతీయ ప్రమాణాలపై వర్క్‌షాప్

గుంటూరుసిటీ, ఫిబ్రవరి28: భారత జాతీయ ప్రమాణాలపై అవగాహన కలిగివుండటం ద్వారా నాసిరకం వస్తువుల వాడకాన్ని నివారించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి అన్నారు. బుధ వారం స్థానిక జడ్పీ సమావేశమందిరంలో భారత జాతీయ ప్రమా ణాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌కి ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో శ్రీదేవి మాట్లాడుతూ.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంలో వాడవలసిన వస్తువుల నాణ్యతను కచ్చితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. భారత జాతీయ ప్రమాణాల అసిస్టెంట్ డైరెక్టర్ వీ.జమీలా మాట్లాడుతూ దేశంలోని అన్ని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవచ్చునన్నారు. వర్క్‌షాపులో జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకాగా, జడ్పీ ఏవో శ్రీనివాసరావు, జిల్లా శిక్షణా సంస్థ మేనేజర్ కే.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఇంజనీర్లు

ఇంధన పొదుపు తప్పనిసరి

● జీఎంసీ ఇన్‌చార్జి ఎస్ఈ సుందర రామిరెడ్డి

● జీఎంసీ పంప్ ఆపరేటర్లకు ఇందన పొదుపుపై శిక్షణ

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 28: మునిసిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరని నగరపాలకసంస్థ ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందరరామిరెడ్డి తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో జీఎంసీ పంప్ ఆపరేటర్లకు ఇందన పొదుపుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా విభాగంలోని పంప్ ఆపరేటర్లు ఇందన పొదుపు అంశంలో కీలకంగా ఉంటారన్నారు. స్థానిక సంస్థల ఆదాయంలో ఎక్కువ భాగం విద్యుత్ బిల్లుల చెల్లింపునకే వినియోగిస్తున్నందున ఇతర అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కూడా ఇందన సంరక్షణ కార్యకలాపాలను అమలు చేయాలన్నారు. అనంతరం పంప్ ఆపరేటర్లకు టూల్ కిట్లు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందించారు. శిక్షణలో సీఆర్డీఏ సీఈ శివ ప్రసాదరాజు, ఈఈ శ్రీనివాస్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, జీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం అంజయ్య

కేపటీ విజేతలకు బహుమతుల ప్రదానం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేపటీ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య అన్నారు. బుధవారం లక్ష్మీపురంలోని శ్రీ చైతన్య క్యాంపస్‌లో కేపటీ విజేతలకు బహుమలు అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం అంజయ్య మాట్లాడుతూ విద్యార్థుల నిరంతర కృషి, ఖచ్చితమైన ప్రణాళిక, ఉపాధ్యాయుల అంకితభావం విజయానికి నాంది పలికాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.వినిత, కో-ఆర్డినేటర్ కేఎస్ఎన్‌మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

గుంటూరు, ఫిబ్రవరి 28: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని కార్యాలయంలో బుదారం జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్దిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు.



రైతు భరోసా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఏవో నున్నా వెంకటేశ్వర్లు

రైతు భరోసా నిధులు జమ

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ● లబ్ధిదారులకు నగదు చెక్కుల అందజేత

గుంటూరు సిటీ,ఫిబ్రవరి 28 : అధిక పంట ఉత్పాదకత కోసం, నాణ్యమైన వ్యవసాయ వనరులను సమయానుకూలంగా కొనుగోలు చేయుటకు , సాగుదారులకు మద్దతు ఇవ్వడమనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఐదో ఏడాది , ఈ ఏడాదికి మూడో విడతగా వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల నగదును రైతుల ఖాతాలకు జమ చేశారు. ఈకార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని గుంటూరు కలక్టరేట్‌లోని వీసీ సమావేశమందిరం నుంచి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం పాల్గొని వీక్షించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2023-24 సంవత్సరంలో మూడవ విడత నిధుల విడుదలలో 1,26,273 మంది భూ యజమాని, కౌలు రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.25.51 కోట్ల నగదును జమ చేసినట్లు తెలిపారు. అలాగే 2023-24 సంవత్సరంలో రైతు భరోసా- పీఎం కిసాన్ 1,26,271 మంది రైతు కుటుంబాలకు రూ.169.89 కోట్ల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రబీ 2021-22, ఖరీఫ్ 2022 కాలానికి సున్నా వడ్డీ పంట రుణాల కింద 22,521 మంది లబ్ధిదారులకు రూ.4.38కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులైన రైతులకు నగదు చెక్కులను అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, పీడీ ఆత్మా రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి పీ. శైలజ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 29: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీ. శైలజ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని గుంటూరు పరీక్షా భవన్ అప్ కాస్ట్ ఆధ్వర్యంలో జాతీయసైన్స్ దినోత్సవాన్ని జిల్లాస్థాయిలో ఘనంగా నిర్వహించారు. జిల్లా లోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు సైన్స్ క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ అంశాలలో పోటీసలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, విద్యార్థులు నిశిత పరిశీలన, ప్రయోగాలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. సైన్స్ అభివృద్ధిపైనే దేశ భవిష్యత్తు ఆధార పడి ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చేందుకు సైన్స్ పోటీలు దోహదపడతాయన్నారు. గుంటూరు ఈస్ట్, వెస్ట్ మండలాల ఎంఈవోలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, బలిరామ్ నాయక్‌లు, ఉర్దూ పాఠశాలల డీఐ ఖాసిం, సీనియర్ ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా, డీఎస్‌వో రవికుమార్ పలువురు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్లో ... ఫిబ్రవరి స్థానిక సంగడిగుంటలోని జైన్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ భారతదేశ వైజ్ఞానిక చరిత్రలో ఒక మైలురాయి అని జైన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ పీ.కనకదుర్గ అన్నారు. స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ మున్ను ఆదేశాల మేరకు ఈ ఏడాది జైన్ హైస్కూల్లో పలు అంశాలపై విద్యార్థులు ప్రయోగాత్మక వైజ్ఞానిక ప్రదర్శనలు అందించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయ డానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జైన్ హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

బాలకుటీర్‌లో.. సైన్స్ తోనే మానవ మనుగడ సాధ్యమని బాలకుటర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్. మంగాదేవి అన్నారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతన, చౌడవరంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రయో గాలుచేసే దిశగా ఎదగాలని, కొత్త ఆవిష్కరణ రూపొందించాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి బాలకుటీర్ సీఏవో దుర్గారఘురామ్, ప్రిన్సిపాల్స్ ఎండీ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, డీన్ లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు శాస్త్రవేత్తల వివరాలను, వారి కృషిని వివరించారు. చిన్నారులు శాస్త్రవేత్తల అలంకరణలతో అలరించారు.



నల్లపాడు రోడ్డులో మిర్చి టిక్కీలతో బారులు దీరిన వాహనాలు

మిర్చియార్డుకు భారీగా సరుకు దిగుమతి

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు సెలవు అనంతరం బుధవారం సాయంత్రం మిర్చియార్డులో సరుకు దిగుమతిని అనుమతించడంతో భారీగా లారీలు, ట్రాక్టర్లు, ఆటోలలో రైతులు మిర్చి టిక్కీలను తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం 4 గంటలకే నల్లపాడు రోడ్డులో ప్రవేశద్వారం నుంచి చుట్టుగుంట వరకు వాహనాలు ఒకవైపున బారులుదీరాయి. అది మొదలుకొని గురువారం వేకువజామున వరకు సరుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో యార్డు ప్రాంగణం మిర్చితో కిక్కిరిసిపోయే పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ నేపథ్యంలో అధికారులు శనివారం కూడా విక్రయాలకు అనుమతిస్తే రద్దీ తగ్గుతుందేమోనని రైతులు భావిస్తున్నారు. తరచుగా నల్లపాడు రోడ్డులో మిర్చి వాహనాలు బారులుదీరుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. దాంతో పరిసర ప్రాంతాల ప్రజలు, సత్తెనపల్లి, నరసరావుపేట మార్గాల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మనదేశాన్ని సూపర్‌పవర్‌గా మార్చాలి

● ఆ బాధ్యత విద్యార్థులదే

● డీఆర్‌డీవో సైంటిస్ట్ -ఎఫ్ డాక్టర్ రామసుబ్బారెడ్డి

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 28: భారత దేశాన్ని సూపర్ పవర్‌గా మార్చే బాధ్యత విద్యార్థులదేనని డీఆర్‌డీవో సైంటిస్ట్ డాక్టర్ పీ.రామసుబ్బారెడ్డి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్‌లోని ఫిజిక్స్ శాఖ ఆధ్వర్యంలో 'నేషనల్ సైన్స్ డే' సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని 'ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ ఫర్ వికసిత్‌భారత్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో సైంటిస్ట్ - ఎఫ్ డాక్టర్ పీ. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఏదైనా అంశాన్ని లోతుగా పరిశోధిస్తేనే అత్యున్నత స్థాయి ఫలితాలను పొందగలమన్నారు. ఎప్పుడూ ఇతరులను అనుసరించే బదులు ఇతరులకు మీరే క్రియేటర్స్‌గా మారాలన్నారు. ఇప్పుడు కష్టపడి చదివితేనే మీరు భవిష్యత్‌లో ఉజ్వలంగా ఎదగగలరన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్ డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నడాక్టర్ పీ.రామసుబ్బారెడ్డి

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

● వైసీపీ రాజకీయ సభలా ప్రభుత్వ కార్యక్రమం

గుంటూరు, ఫిబ్రవరి 28: రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ నేతృత్వంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి రజనీ ప్రసంగిస్తూ వలంటీర్లే జగనన్నకు సైన్యం కావాలన్నారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ వైసీపీని గెలిపించేందుకు వలంటీర్లు ఈ 45 రోజులు దీక్షలా పనిచేయాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తీసేస్తారని, జగనన్న సీఎం అయితేనే మీ ఉద్యోగాలు ఉంటాయని, జగనన్నను గెలిపించాల్సిన బాధ్యత మీపైనా ఉందన్నారు. సభలో జై జగన్ అంటూ వలంటీర్లతో నినాదాలు చేయిం చారు. అనంతరం వలంటీర్లకు సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరుతో మొత్తం 1597 మందికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, జీఎంసీ డీసీ వెంకటకృష్ణయ్య పలువురు సిబ్బంది, పార్టీ నాయకులున్నారు.



వలంటీర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి రజనీ, మేయర్, ఎమ్మెల్యే

వేదికపై పార్టీ నాయకులు, జగన్ పాటలు..

జింకానా ఆడిటోరియంలో జరిగిన సభా వేదికను అచ్చం వైసీపీ సభలా నిర్వ హించటం చర్చనీయాంశంగా మారింది. సభలో మంత్రి, ఎమ్మెల్యే, మేయర్, ఎమ్మెల్సీతో పాటు పదవుల్లో నేతలతో పాటు పార్టీ నాయకులను కూడా ఆహ్వానిం చటంపై విమర్శలు వెల్లువెత్తాయి. వేదికపై బత్తుల దేవానంద్, బందా రవీంద్రనాథ్, మహిళా కార్పొరేటర్ల భర్తలు వేదికపై హల్‌చల్ చేశారు. మరో వైపు జగన్ పాటలు పెట్టటం కూడా చర్చనీయాశంగా మారింది.

మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు



సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు సామాజిక ప్రయోజనం కూడా ఉండాలని నమ్మే దర్శకుల్లో ఎన్.శంకర్ ఒకరు. పలు విభిన్న చిత్రాలు రూపొందించిన ఆయన తాజాగా చారిత్రక నేపథ్యంలో మూడు వెబ్ సిరీస్‌లు తీయడానికి సంకల్పించారు. బుధవారం వాటి విశేషాలు వెల్లడిస్తూ 'తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో కలవడం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాట నేపథ్యం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంతవరకూ ఉద్యమాల్లో జరిగిన ఆటుపోట్లు... తదితర అంశాలను ప్రజల కోణంలో చూపించాలని మా ప్రయత్నం. అక్టోబర్ నుంచి షూటింగ్‌కు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. అలాగే జ్యోతీరావు ఫూలే అనుభవాలు, అవమానాలు కథాంశంగా మరో వెబ్ సిరీస్‌ను, అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తి ఇతివృతంగా ఇంకో వెబ్ సిరీస్ నిర్మిస్తామని ఆయన చెప్పారు. జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ వెబ్ సిరీస్‌లు వారి బయోగ్రఫీలు కాదని శంకర్ స్పష్టం చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ మూడు వెబ్ సిరీస్‌లు నిర్మిస్తామనీ, మూడేళ్ల నుంచి తన టీమ్‌తో కలసి కథలపై వర్క్ చేస్తున్నామని తెలిపారు.

రాజుగారి అమ్మాయితో నాయుడుగారి అబ్బాయి



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి- నాయుడుగారి అబ్బాయి' చిత్రం ట్రైలర్‌ను బుధవారం దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్‌తో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రం ఇది. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన ముత్యాల రామదాసు మాట్లాడుతూ 'చిన్న సినిమాలు కూడా పెద్ద విజయం సాధిస్తున్నాయి. దర్శకుడు సత్యరాజ్‌కు మంచి విజన్ ఉంది. ఎన్నో సమస్యలు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా తీసిన సినిమా ఇది. మార్చి 9న విడుదల చేస్తున్నాం. సినిమాలో హీరోగా నటించిన కొత్త నటుడు రవి తేజ పెద్ద హీరోగా ఎదగాలి' అన్నారు. 'ముత్యాల రామదాసు గారు మా వెనుక ఉండి ఈ సినిమాను విజయవంతంగా పూర్తి చేయించారు. మా అమ్మ నున్నా కుమారిగారు లేకపోతే ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ అవదు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. అందరినీ ఆకట్టుకొనే చిత్రం అవుతుంది' అన్నారు రవితేజ. ఈ చిత్రనిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దర్శకుడు సత్యరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/NwRzjye లో చదవండి.

ప్రేక్షకులు గర్వపడేలా ఆపరేషన్ వాలెంటైన్



వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సిద్ధు ముద్దా, నందకుమార్ అబ్బినేని బుధవారం మీడియాతో మాట్లాడారు

- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ మాకు, వరుణ్‌కి బాగా నచ్చింది. దాన్నే ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌గా చేయాలనే ప్రయత్నాల్లో దర్శకుడు ఉన్నప్పుడు ఆ కథ విన్నాం. బాగా నచ్చడంతో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. సోనీ పిక్చర్స్ నిర్మాణ భాగస్వామిగా రావడంతో తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా తీశాం.
- కొత్త వాడైనా ప్రతాప్ సింగ్‌కు మంచి క్లారిటీ ఉంది. సినిమాకు ఏం కావాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాగే తను అదే నేపథ్యం నుంచి వచ్చారు కనుక వీఎఫ్ఎక్స్ మీద మంచి కమాండ్ ఉంది. 'ఫైటర్' తర్వాత ఇలాంటి భారీ ఎయిర్ సీక్వెన్స్‌తో ఇండియాలో వచ్చిన మా చిత్రాన్ని ఆయన చాలా అద్భుతంగా తీశారు. గ్వాలియర్ ఎయిర్ బేస్‌లో సినిమాను షూట్ చేశాం. రియల్ ఎయిర్ బేస్‌లో షూటింగ్ చేయడం ఒక కొత్త అనుభూతి. వాయు సేన సైనికుల త్యాగాలను, ధైర్యాలను స్మరించుకుంటూ వాళ్ల కథని ప్రేక్షకులకు చెప్పాలనే ఆలోచనతో ఈ సినిమా నిర్మించాం.

'హాఫ్ లయన్'గా పీవీ బయోపిక్



ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారతరత్న పురస్కార గ్రహీత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత ప్రస్థానాన్ని బయోపిక్ రూపంలో తెర మీదకు తీసుకురావడానికి సిద్ధమయ్యాయి. ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌ను 'హాఫ్ లయన్' పేరిట వెబ్ సిరీస్‌గా రూపొందిస్తున్నారు. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ప్రకాష్ ఝా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాన్ ఇండియన్ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను విడుదల చేయబోతున్నారు. పీవీ నరసింహారావు జీవితంలోని కీలక మైలురాళ్లను ఈ సిరీస్ హైలైట్ చేయనుంది.

అందరినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది



శివ కందుకూరి హీరోగా రూపొందిన క్రైమ్‌థ్రిల్లర్ 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. రాశి సింగ్ కథానాయిక. మార్చి 1న ఈచిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ట్రైలర్ ఈవెంట్‌ను చిత్రబృందం నిర్వహించింది. శివ కందుకూరి మాట్లాడుతూ "భూతద్ధం...'ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. గీతా డిస్ట్రిబ్యూషన్ విడుదల వల్ల సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువవుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాతో దర్శకుడిగా నా కల నెరవేరింది. శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. శివ లాంటి హీరో దొరికినందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు.


నాయర్ నా భర్తే : మలయాళ నటి హర్షం



'గగన్‌యాన్'కు సంబంధించి ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ప్రశాంత్ నాయర్ ఒకరు. వ్యోమగామిగా ఈయనను ఎంపిక చేస్తూ ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత మలయాళ సినీ నటి, స్నేహం సినిమాలో నటించిన లీనా సంతోషంతో ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. "నాయర్ నా భర్తే, మాకు గత నెల 17న వివాహం జరిగింది. మాది పెద్దలు కుదిర్చిన వివాహం. నాయర్‌ను వ్యోమగామిగా ప్రకటించిన సందర్భం నా జీవితంలో మరువలేనిది. ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ఈ దేశానికి, మా రాష్ట్రానికి(కేరళ), వ్యక్తిగతంగా నాకు ఎంతో గర్వకారణం" అని ఆమె పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

నదీ జలాల వివాదాలు




ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అల్మట్టి వివాదం

- కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచి ఈ వివాదం ఉంది.
- దీనికి సంబంధించిన ట్రిబ్యునల్స్: బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్
- అల్మట్టి డ్యాం వాస్తవ ఎత్తు: 517 మీటర్లు
- ఎత్తు పెంచడంలో భాగంగా కర్ణాటక ప్రతిపాదించిన ఎత్తు: 524. 25 మీటర్లు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన ఎత్తు: 519.6 మీటర్లు

కృష్ణా నది జలాల వివాదం (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్)

- 1969 ఏప్రిల్ 10: బచావత్ ట్రిబ్యూనల్ ఏర్పాటు (ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్-1956 ప్రకారం)



ఇండియన్ జాగ్రఫీ

- ఇది 1973లో తుది తీర్పు ఇచ్చింది. దీనిలో స్కీమ్-ఎ లో నికర జలాలు, స్కీమ్-బి లో మిగులు జలాలను పంపిణీ చేసింది. కృష్ణా నదిలో లభించే మొత్తం నీటిలో 75 శాతం నికర నీటి లభ్యతగా గుర్తించి పంచింది.
- 1976 మే 31: ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ తుది తీర్పు గెజిట్‌ను ప్రకటించింది.

దీని ప్రకారం కృష్ణా నదిలో నికర జలాల లభ్యత 2060 టీఎంసీలుగా పేర్కొంది.

- మహారాష్ట్ర - 560, కర్ణాటక-700, ఆంధ్రప్రదేశ్ 800 టీఎంసీల నీటి వాటా కలిగి ఉన్నాయి.

నోట్: మిగులు జలాలు అంటే...ప్రాజెక్ట్‌లలోని నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించి సాగునీటికి, వివిధ అవసరాలకు ఉపయోగించగా, మిగిలిపోయి తిరిగి నదిలో కలిసే జలాలు.

- ట్రిబ్యునల్ 70 టీఎంసీలను మిగులు జలాలుగా పేర్కొని, మహారాష్ట్రకు-25, కర్ణాటకకు-45, ఆంధ్రప్రదేశ్‌కు-11 టీఎంసీలు కేటాయించింది.
- 2004 ఏప్రిల్ 2: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ట్రిబ్యునల్ అధికారికంగా అమలులోకి వచ్చింది. 2010 డిసెంబరు 31న కర్ణాటకకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అదేవిధంగా మిగులు జలాల వాటాను ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు పంచింది. కృష్ణానది నికర నీటి లభ్యతను 2594 టీఎంసీలుగా లెక్కించింది(మిగులు జలాలను కూడా కలిపింది). మహారాష్ట్రకు-666 టీఎంసీలు, కర్ణాటకకు-911 టీఎంసీలు, నది పరిరక్షణ కోసం-16 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు-1001 టీఎంసీలు కేటాయించింది.

నోట్: తదుపరి నది జలాల పునఃసమీక్ష 2050 తర్వాతే ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది.

కావేరీ నది జలాల వివాదం

కావేరీ నది నీటిని తమిళనాడు గ్రాండ్ ఆనకట్ట (కళ్లనై డ్యామ్)ను రెండవ శతాబ్దంలో నిర్మించడం ద్వారా, 1934లో నిర్మించిన మెట్టూరు డ్యామ్ ద్వారా చాలా సంవత్సరాల నుంచి వినియోగించుకుంటోంది. అయితే కర్ణాటక 1932లో కృష్ణరాజ సాగర్ డ్యామ్ ద్వారా, తమిళనాడుకు వచ్చే కావేరీ జలాల లభ్యత తగ్గిపోవడంతో వివాదాలు ప్రారంభమయ్యాయి.

- కావేరీ నది పరివాహక ప్రాంతం: తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిలో ఉంది.
- 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరీ వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది.
- 1998లో కావేరీ రివర్ అథారిటీని ఏర్పాటు చేసింది
- 2028 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కావేరీ నది జలాల పంపిణీ: మొత్తం 726 టీఎంసీలలో కర్ణాటకు 284.75, తమిళనాడుకు 404.25, కేరళకు 30, పాండిచ్చేరికి 7 టీఎంసీల వాటా లభించింది.

ముళ్ల పెరియార్ డ్యామ్ వివాదం

ప్రస్తుత కేరళ రాష్ట్ర సరిహద్దు లోపల, ఒకప్పటి ట్రావెన్ కోర్ సంస్థానంలో పెరియార్ నదిపై ఈ డ్యామును నిర్మించారు. 1886లో బ్రిటిష్ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ సంస్థానం నుంచి డ్యామ్ ఉన్న ప్రదేశాన్ని 999 సంవత్సరాలకు లీజుకు తీసుకుని నిర్మించింది. డ్యామ్ వెనుక భాగంలో సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా తమిళనాడులోని వైగై నదిలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా 68 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.



కేరళ వాదన: 120 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్యామ్ భద్రత గురించి కేరళ అభ్యంతరాలను తెలియజేస్తోంది. ఇది తెగిపోతే దిగువన ఉన్న ఇడుక్కీ డ్యామ్, పెరియార్ బ్యారేజ్‌లు ప్రమాదంలో పడతాయి. కనుక, ప్రస్తుతమున్న డ్యామ్‌ని కూల్చివేసి, కొత్త డ్యామ్ నిర్మించాలి. అది కూడా ప్రస్తుత 142 అడుగుల ఎత్తు కాకుండా 136 అడుగుల ఎత్తు మాత్రమే నిర్మించాలని వాదిస్తోంది.

తమిళనాడు ప్రభుత్వ వాదన: 2010లో డ్యామ్ భద్రతపై పరిశీలన కోసం ఏ.ఎస్.ఆనంద్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ డ్యామ్ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. 136 అడుగుల నుంచి 142 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

పాలార్ నది వివాదం

పెన్నా, కావేరీ నదుల మధ్యలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ద్వారా స్వతంత్రంగా ప్రవహించే మధ్యస్థ నది. ఈ నది తమిళనాడులోని వెల్లూరు, కంచి ప్రాంతాలకు జీవనాధారం. ఈ నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తూరు జిల్లా కుప్పం వద్ద డ్యామ్ నిర్మాణం ప్రారంభించింది. దీనిని తమిళనాడు వ్యతిరేకిస్తోంది.



వి. వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

సింధూనది జలాల ఒప్పందం

1960లో సింధూజలాల ఒప్పందం ఇండియా - పాకిస్థాన్ మధ్య జరిగింది. దీని ప్రకారం పశ్చిమ నదులైన- సింధూ, జీలం, చీనాబ్ నదులలోని మొత్తం నీటి ప్రవాహంలో 80 శాతం పాకిస్థాన్‌కి, 20 శాతం ఇండియాకి కేటాయించారు. తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్ నదులలో మొత్తం నీటిలో 80 శాతం ఇండియాకి, 20 శాతం పాకిస్థాన్‌కి కేటాయించారు.

బాగ్లీహార్: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా చీనాబ్ నదిపై భారత్ నిర్మించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంక్‌లో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలన కోసం లఫైతే(స్విట్జర్లాండ్) కమిటీని నియమించారు. 2010లో ఈ వివాదం పరిష్కారమైంది.

కిషన్ గంగా: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా జీలం, కిషన్ గంగా నదుల ఆధారంగా నిర్మించారు. ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలనకు స్విబెల్ కమిటీ(బ్రిటన్)ని నియమించారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UWKOdquలో చదవండి.

సీయూఈటీ(యూజీ) 2024

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలు సహా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కళాశాలలు, ప్రభుత్వ/ ప్రైవేట్ యూనివర్సిటీలు అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ఉద్దేశించిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది.

ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష రాయవచ్చు. ఒక జనరల్ టెస్ట్ పేపర్, 33 లాంగ్వేజ్ టెస్ట్ పేపర్లు, 27 డొమైన్ సబ్జెక్ట్ పేపర్ల నుంచి అభ్యర్థులు కనిష్ఠంగా మూడు, గరిష్ఠంగా ఆరు టెస్ట్ పేపర్లు రాసే వీలుంది.

డొమైన్ సబ్జెక్టులు

అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/ బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/ విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోం సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/ మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లైయిడ్ మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్/యోగా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, టీచింగ్ ఆప్టిట్యూడ్. వీటికి తోడు ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ తదితర సబ్జెక్టులు కూడా ఉన్నాయి

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** మూడు సబ్జెక్టుల వరకు జనరల్ అభ్యర్థులు రూ.1000; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.800; విదేశీ అభ్యర్థులు రూ.4500 చెల్లించాలి. ప్రతి అదనపు సబ్జెక్టుకు జనరల్ అభ్యర్థులు రూ.400; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.375; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.350; విదేశీ అభ్యర్థులు రూ.1800 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams. nta.ac.in/CUET-UG/

ఎగ్జామ్ వివరాలు

దీనిని హైబ్రిడ్ మోడ్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/పెన్&పేపర్ టెస్ట్)లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో మూడు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో లాంగ్వేజ్ టెస్ట్‌లు ఉంటాయి. రీడింగ్ కాంప్రహెన్షన్, లిటరరీ ఆప్టిట్యూడ్, ఒకాబులరీలకు సంబంధించి 50 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో డొమైన్ సబ్జెక్ట్ టెస్ట్‌లు ఉంటాయి. ఇంటర్/పన్నెండోతరగతి సిలబస్ ఆధారంగా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాలనుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు.

అభ్యర్థులు జనరల్ టెస్ట్ సహా డొమైన్ సబ్జెక్టుల నుంచి 4 లేదా 5 పేపర్లు; లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 1 లేదా 2 పేపర్లు చొప్పున గరిష్ఠంగా 6 పేపర్లు ఎంచుకోవాలి. జనరల్ టెస్ట్ సహా కనీసం ఒక లాంగ్వేజ్ ఉండేలా చూసుకోవాలి.

మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, జనరల్ టెస్ట్ పేపర్లకు ఒక్కోదానికి పరీక్ష సమయం ఒక గంట. మిగిలిన అన్ని పేపర్లకూ ఒక్కోదానికి 45 నిమిషాలు ఇస్తారు.

మురుగు కాల్వలపై ఆక్రమణలను తొలగించండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, తదితరులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 28: పట్టణంలో మురుగు కాల్వలను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా తొలగించాలని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక షరాఫ్ బజారు 19వ వార్డులో బుధవారం పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో శానిటేషన్ సమస్యలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా ఇంటివారు, షాపు యజమానులు మురుగు కాల్వలను ఆక్రమించారని, సిల్ట్ తీయక మురుగు పేరుకుపోయి మురుగునీరు పారటంలేదన్నారు. వార్డు ప్రజలు సహకరించి ఆక్రమలను స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే తమ సిబ్బంది తొలగిస్తారని హెచ్చరించారు. సుందర తెనాలికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, గ్రీనరీ సిబ్బంది, సచివాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రిజిస్ట్రేషన్ మేళా

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 28: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నేడు పేదలందరికీ ఇల్లులో భాగంగా రిజిస్ట్రేషన్ మేళాను నిర్వహిస్తున్నట్టు పట్టణ మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న తెలిపారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా శాశ్వత స్థల హక్కు పథకం కింద పురపాలక సంఘ పరిధిలోని 1 నుంచి 47వ వార్డు సచివాలయం పరిధిలో మొత్తం 20,224 ఇండ్ల స్థల పట్టాలకుగాను 17,903 ఇండ్ల స్థల పట్టాలను లబ్ధిదారుల పేరున రిజిస్టర్ చేశామని కమిషనర్ తెలిపారు. మిగిలిన 2,321 ఇండ్ల స్థల పట్టాలను లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేయవలసి ఉన్నదన్నారు. మిగిలిన లబ్ధిదారులకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో గల 47వ వార్డు సచివాలయ హాలులో గురువారం రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించబడుతుందని కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు.



ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

ఆరోగ్య సురక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 28: పట్టణ ప్రజలు ఆరోగ్య సురక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న అన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని 35వ వార్డు పరిధిలోని పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బుధవారం రెండో విడత ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్నలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ అనారోగ్య సమస్యలకు డాక్టర్లు తగు వైద్య సలహాలను, ఉచిత మందులను ఇస్తారని తెలిపారు. ఈ శిబిరంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారుపూరు హెలెన్ నిర్మల, డాక్టర్‌లు వట్టిప్రోలు మౌనిక కుమార్, ముద్రకోల అనురాధ, సీహెచ్ దేవకిలు పాల్గొన్నారు. జనరల్ ఓపీ 14 మంది, గైనకాలజి ఓపీ 25మంది, ఆప్తోమెట్రీషియన్ ఓపీ 106 మంది, డెర్మటాలాజీ ఓపీ 30 మందిని పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గొడవర్తి సాయిహరేరామ్, యూఎల్‌బీ ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్రమౌళి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ వినోద్ బాబు, సూపర్వైజర్ బంగారు మల్లేశ్వరావు, హెల్త్ విజిటర్ దాసరి విజయకుమారి, హెల్త్ అసిస్టెంటు రషీద్, ఏన్‌యం ఆరే సౌజన్య దెబోరా, డీఈవో నాగేశ్వరావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ: నగలు అపహరణ

కొల్లిపర, ఫిబ్రవరి 28: పట్టపగలే ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువా తాళాలు పగలగొట్టి బంగారు నగలు చోరీ చేసిన సంఘటన మండల కేంద్రం కొల్లిపరలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపరకు చెందిన రావూరు నాగలక్ష్మి బుధవారం ఉదయం 10గంటలకు రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగం చేయటానికి వెళ్ళింది. మధ్యాహ్న సమయంలో ఒంటి గంటకు ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్ళి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న 2తులాల బంగారపు గాజులు, 2 తులాల నల్లపూసల గొలుసు, 4గ్రాముల ఉంగరం, రూ.2వేలు నగదు చోరీకి గురికావటంతో వెంటనే ఈ విషయాన్ని కొల్లిపర పోలీసుస్టేషన్ ఫిర్యాదుచేయగా ఎస్‌ఐ రవీంద్రరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సినిమా సంఘాలు సంఘటితం కావాలి

● ఏపీ మా వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28: సినీ పరిశ్రమలోని సమస్యలను సాధించేందుకు సినిమా సంఘాలన్నీ సంఘటితం కావాలని ఏపీ మా వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా కోరారు. బుధవారం సుల్తానాబాద్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, యూనియన్ల మధ్య విభేదాలు ఉంటే ప్రభుత్వాలు పట్టించుకోవన్నారు. 1952 సినిమాటోగ్రఫీ చట్టాన్ని సవరిస్తూ కేంద్రం 2023 సవరణలను అన్ని సంఘాలతో సమీక్షించాలన్నారు. కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ అన్ని సంఘాలతో చర్చించాకే చట్ట సవరణలు చేయాలని కోరారు. ఎఫ్‌డీసీ సిఫారసు చేసిన సినిమాలకు రూ.10 లక్షలు సబ్సిడీ పునరాలోచన చేయాలన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 28: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లు కొనసాగుతున్నాయని నాయకులు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో బుధవారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజీ చౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవీలత దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, క్రొత్తపల్లి రమేష్, వెల్లంకి సాంబయ్య, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, ఎ.వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



మున్నంగి ప్రాథమిక పాఠశాలలో వివిధ రకాల నమూనాలను ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28: మండలంలోని కొలకలూరు శాఖ గ్రంథాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్త సర్ సీవీరామన్ గౌరవార్థంగా జరిపే జాతీయ సైన్స్ దినోత్సవంపై విద్యార్థులకు వివరించారు. ఆయన కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్‌కు నోబెల్ బహుమతి పొందారని ప్రపంచ దేశాల్లో భారత్‌కు గర్వకారణంగా నిలిచిన వ్యక్తి సర్‌సీవీ రామన్ అని కొనియాడారు. నేటి పౌరులు దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలని సుజాత విద్యార్థులకు సూచించారు. తొలుత గ్రంథాలయాధికారిని కడియాల సుజాత విద్యార్థులతో కలిసి సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూ చైతన్య స్కూల్ టీచర్ విజయ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సర్‌సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుజాత, విద్యార్థులు తదితరులు

ఎగ్జిబిషన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సైన్సు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థులలో మేధాశక్తిని వెలికితీయ వచ్చునన్నారు. తొలుత ఉపాధ్యాయులు భారతీయ భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్‌కు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీకమల తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఎండీ మురళీకాంత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలంటే పట్టుదల, కృషి, ప్రణాళిక అవసరమన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను సందర్శించి విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పలు శాస్త్రవేత్తల చిత్రాలను ప్రదర్శించి వారి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. పాఠశాల నుండి పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. కాలుష్యాన్ని అరికట్టాలని, నీటిని సంరక్షించాలని, పెరుగుతున్న భూతాపాన్ని అరికట్టాలంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలి: హెచ్‌ఎం రాము

కొల్లిపర, ఫిబ్రవరి 28: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రాము అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్సు ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు వాక్యూమ్ క్లీనర్, ఎయిర్‌కూలర్, బయోడైవర్శిపార్క్, సౌరవిద్యుత్ గ్రామము, పోషకాహార విలువలు, బిందు సేద్యం, ధ్వని కాలుష్యం, మానవ జీర్ణాశయపు భాగాలు వంటివి ప్రయోగాత్మకంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు సైన్సు



నారాకోడూరు పాఠశాలలో సీవీ రామన్‌కు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

చేబ్రోలు, ఫిబ్రవరి 28: విద్యార్థులు శాస్త్రీయ దృపథం అలవర్చుకొన్ని శాస్త్రవేత్తలుగా ఎదగాలన్ని ఏంఈవోలు ఏవిహెచ్ ప్రసాద్, రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సి వి రామన్ చిత్రపట్టానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సైన్స్ ప్రముఖ్యతను విద్యార్థులకు తెలియజేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు, ఉపాధ్యాయులు డి శ్రీనివాస్, అరుణ కుమారి, చలపతిరావు, రాధాకృష్ణమూర్తి, పరిశుద్ధం, ఏ శ్రీనివాసరావు, బి వెంకటేశ్వరరావు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తల చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రేపటి నుంచి అగ్నిబాధిత రైతుల రిలే దీక్షలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28: దుగ్గిరాల శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం అందించకుండా బాధిత రైతుల పేర్లు కూడా ప్రభుత్వం వెల్లడించకపోవడాన్ని ఖండిస్తూ మార్చి 1, 2, 3 తేదీల్లో దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టామని కార్యాచరణ కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్.డబ్ల్యూ.ఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రిలే నిరాహార దీక్షలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వెంకట్రామయ్య మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగి 40రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. సుమారుగా రూ.100 కోట్లువిలువ జేసే పసుపు అగ్నికి ఆహుతైందని, నష్టపోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం క్వింటాల్‌కి రూ.12 వేలు చెల్లించాలని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ మార్చి1న ప్రారంభమయ్యే రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శాసన మండలి సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారని చెప్పారు. పసుపు రైతులకు మద్దతుగా వరి, మొక్కజొన్న, నిమ్మ రైతులు కూడా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ విపత్తుల నిధి నుంచి డబ్బు కేటాయించి పసుపు రైతులను ఆదుకోవాలన్నారు.

సమావేశంలో తెనాలి, దుగ్గిరాల మండలాల రైతు సంఘం అధ్యక్షుడు మద్దన సాంబశివరావు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, కొల్లూరు మండల వ్యవసాయకార్మిక సంఘం కార్యదర్శి బొనిగల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28: జాతీయ లోక్ అదాలత్ మార్చి 16కు వాయిదా పడిందని పోక్సో కోర్టు జడ్జి కేఎస్ రామకృష్ణారావు తెలిపారు. మార్చి 9న జరగాల్సి ఉండగా మహాశివరాత్రి పండుగ, వరుస సెలవల కారణంగా 16కు వాయిదా వేశామని తెలిపారు.



నైపుణ్యాల అవశ్యకత వివరిస్తున్న ఏజీఎం వెంకటేశ్వరరావు

పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు అవసరం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28: విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేందుకు నైపుణ్యాలు పెంపొందుచుకోవాల్సిన అవసరం ఉందని నారాయణ విద్యా సంస్థల ఏజీఎం కె.వెంకటేశ్వరరావు చెప్పారు. చెంచుపేటలోని నారాయణ స్కూల్‌లో బుధవారం సాఫ్ట్ స్కిల్స్ అనే అంశంపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మాతృభాషతో పాటు ఆంగ్ల భాష ప్రావీణ్యం ఎంతో ముఖ్యమని దానితో పాటు సబ్జెక్టుల్లో పట్టు, నాయకత్వ లక్షణాలు, బృంద చర్చల్లో ముందుంటే భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జీవన్, విద్యాసాగర్, ప్రమోద్‌జోషిలు సాఫ్ట్ స్కిల్స్ సాధనకు విద్యార్థులు అవలంబించాల్సిన విధానాలు వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు పట్టు సాధించాలి

● మాంటిస్సోరి ప్రిన్సిపాల్ జేమ్స్ మోరే

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు పట్టు సాధించేందుకు సైన్స్ విజ్ఞాన ప్రదర్శన దోహదపడుతుందని మాంటిస్సోరి ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని స్కూల్‌లో బుధవారం సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు పలు నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. పాఠశాలలోని తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు నమూనాలను సందర్శించారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. రైతు బజారు ప్రాజెక్టుచేసిన కె.నాగమల్లేశ్వరి ప్రథమ బహుమతి, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూపొందించిన జ్యోతి స్వరూపకు ద్వితీయ బహుమతి అందించారు. ఎం.లక్ష్మీనారాయణ, స్వాతి, 3వ కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

● పీహెచ్‌సీ వైద్యుడు హనీఫ్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28: మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హనీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని సంగంజాగర్లమూడిలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులున్న తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలు చిన్నారులకు అందించడం ద్వారా అంగవైకల్యం అనేది దరిచేరే అవకాశం ఉండదని వాటిపై లేనిపోని అపోహలు మాని తప్పనిసరిగా బిడ్డలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. పీహెచ్‌సీ నుంచి సిబ్బంది గ్రామంలో పర్యటిస్తూ చిన్నారులకు చుక్కలు వేస్తారన్నారు. ఇంటివద్ద అందుబాటులో లేని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, పీహెచ్‌సీ సెంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. 100శాతం చిన్నారులకు పోలియో చుక్కలు అందించడమే లక్ష్యంగా ఉన్నామని ప్రతి ఒక్కరూ సహకరించాలని హనీఫ్ కోరారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న సీఈవో భాస్కర్

ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28: వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. సీఈవో నన్నపనేని భాస్కర్ మాట్లాడుతూ, నేటి సాంకేతిక యుగంలో విద్యార్థులు ముందుండాలంటే కోడింగ్ ఎంతో ముఖ్యమన్నారు. సబ్జెక్టుల్లో పట్టు, ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడటం, ధైర్యంగా సమస్యను ఎదుర్కొని సాధించడం వంటి నైపుణ్యాలు అవసరమన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, కేవలం సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తే సరిపోదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అజయ్, రవీంద్రనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నేలపాడులో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల సేవా కార్యక్రమం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28: రూరల్ మండలంలోని నేలపాడులో ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని ఈ నెల 29 వరకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ కె.వెంకటరమణ తెలిపారు. గ్రామ సమస్యలపై సర్వేచేసి రికార్డు రూపొందించడం, మొక్కల పెంపకం, చెట్ల సంరక్షణ ప్రజలకు వివరించడం, ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే నష్టాలు, పరిసరాల పరిశుభ్రత, ప్రాధాన్యతంపై గ్రామంలో పర్యటించి విద్యార్థులు వివరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, శర్మ పాల్గొన్నారు.

రాజధానిలో ఆగని దొంగతనాలు

● రైతుల ప్లాట్లలో మట్టిని తవ్వేస్తున్న అక్రమార్కులు

● అర్ధరాత్రి తుళ్లూరులో ప్రైవేటు స్థలానికి మట్టి తరలింపు

తుళ్లూరు, ఫిబ్రవరి 28: రాజధానిలో దొంగతనాలు ఆగటం లేదు. కంకరు ఇసుక, ఐరన్, గ్రావెల్, రైతుల పాట్లలో మట్టిని అక్రమార్కులు దోచేస్తున్నారు. పది రోజుల క్రితం వెంకటపాలెం రెవెన్యూ పరిధిలో అక్రమార్కులు మట్టి కాజేస్తుంటే రైతులు పట్టుకొని పోలీసులకు లారీని అప్పజెప్పారు. బుధవారం అర్ధ రాత్రి ఒంటి గంట సమయంలో తుళ్లూరులో ఓ ప్రైవేటు స్థలానికి మెరక నిమి త్తం మట్టి తోలారు. రైతుల ప్లాట్లలో దొంగిలించి మట్టిని తోలేందుకు ఒప్పందం చేసుకున్నారు. లారీ రూ.4వేలు అని మాట్లాడుకున్నారు. ఆ స్థలంలో జేసీబీతో మట్టిని చదును చేసే పనిని కూడా వారే చేసేటట్లు కుదుర్చుకున్నారు. ఒక లారీ అన్‌లోడు చేసి చదును చేశారు. ఇంకా 30 లారీల వరకు రావాల్సి ఉండగా ఈలోపు స్థలం పక్కన ఇళ్ల వాళ్లు వాహనాల శబ్దాలు పడక పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఆగిపోయింది. జేసీబీని వెంటనే అక్కడ నుంచి తరలించారు.



నిఖిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నరేంద్ర కుమార్

చిన్నారి నిఖిత మృతి కలచివేసింది: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని నండూరు గ్రామానికి చెందిన చిన్నారి ముదిగర్ల నిఖిత మృతి తనను తీవ్రంగా కలచివేసిందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం నండూరులోని నిఖిత గృహానికి వెళ్లిన నరేంద్ర కుమార్ నిఖితకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇటీవల చిన్నారి నిఖితపై ప్రహరీ రాళ్లు పడి తీవ్రంగా గాయపడి మూడు రోజుల పాటు చికిత్సపొందుతూ మృతి చెందింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రు రామారావు, మహిళా మండల అధ్యక్షురాలు బుడ్డ శివమ్మ, యాన్నం శివ వేణు, మిండాల శ్రీనివాసరావు, ముడ్డ వీరయ్య, శంకర్ తదితరులు చిన్నారికి నివాళులు అర్పించారు.

సుద్దపల్లిలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నరేంద్రకుమార్ తదితరులు

చేబ్రోలు, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామంలో బుధవారం గంగా అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. అలాగే రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ప్రత్యేక ఉత్సవాలో జరిగిన పూజా కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేసారు.

ఈశ్వరమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ధూళిపాళ్ల



ఈశ్వరమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న నరేంద్ర కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 28: పెదకాకాని మండల పరిధిలోని నంబూరులోని ఈశ్వరమ్మ అమ్మవారి ఆలయాన్ని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దర్శించుకున్నారు. బుధవారం రాత్రి ఆలయంలో జరుగుతున్న 17వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలూరమ్మ ఆలయ వార్షికోత్సవం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని ఆలూరు గ్రామంలోని ఆలూరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం గణపతి పూజ నిర్వహించారు. విశ్వశాంతి కోసం దుర్గా హోమం జరిపారు. మహాపూర్ణహుతి నిర్వహించి మహిళలతో లక్ష కుంకుమార్చన జరిపారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రైతులు గ్రామస్థులు పంట ఉత్పత్తులను బహూకరించారు. సాయంత్రం ఆలయం వద్ద ప్రభల ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ వార్షిక మహోత్సవాలలో మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

వివా ది స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 28: వివా ది స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వృక్షాల రక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ సాధ్యంపై విద్యార్థుల రూపొందించిన నమూనాలు ఆలోచింపచేశాయి. భౌతిక రసాయన శాస్త్రాలపై అవగాహన కలిగిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. సైన్స్ ప్రదర్శనలు తిలకించిన తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కే శ్రీనివాసరావు, వివా ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం హెడ్ కే.మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని డీఆర్‌కే కాలనీలో మద్యం విక్రయిస్తున్న మహిళను అర్బన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సొంటి వీరమ్మ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని ఆమెను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ పి.భాస్కర్ తెలిపారు.



టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రదర్శ నిర్వహిస్తున్న టైలర్లు

ఘనంగా టైలర్స్ డే

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలో టైలర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక తోటమ్మ తల్లి ఆలయం వద్ద యూనియన్ కార్యాలయంలో టైలర్స్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎలిస్ హోవేకు నివాళులర్పించారు. ఎలిస్ హోవే కనిపెట్టిన కుట్టు యంత్ర నేడు కోట్లాది మందికి జీవనోపాధిని కల్పిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు బండారు ఉమామహేశ్వరి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు, నదీం, రాజు, చాంద్ బాషా, జిలానీ, శ్రీనివాసరావు, జైతూన్, విజయ, అఫ్రిది, శారద తదితరులు పాల్గొన్నారు.



దశావతారుని సన్నిధిలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

దశావతారుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఫిబ్రవరి 28: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలోని మహాగణపతిస్వామి వారికి బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా సంకటహర చతుర్థి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్య తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.